అభినవసరస్వతి

యను నొక మాసపత్రిక.

నాగరఖండ స్వర్ణకారవ్యవహారాది బహుగ్రంథకర్తయగు
జానపాటి పట్టాభిరామశాస్త్రిచే
ప్రచురింపఁబడుచున్నది.

జానపాడు.

సంపుటము 19 | 1927 సం॥ డిశంబరు నెల. | సంచిక 9

విషయములు.

౧ ఆంధ్రభాషా ప్రస్తుత స్థితి - గ్రంథాలయసర్వస్వము.

౨ అగస్త్యసంప్రదాయము.

3 నాగరఖండము - సంపాదకుఁడు.

చందానిర్ణయము సంవత్సరమునకు

ప్రధానపోషకులకు	రు 25 0 0	సహాయులకు	రు 5 0 0
పోషకులకు	రు 10 0 0	చందాదారులకు	3 0 0

Printed at the Chandrika Press, Guntur,
and published at Janapadu by the Editor, Astavadhani
Janapati Pattabhirama Sastry,
author of Nagarakhandam, Swarnakaravyavaharam
etc., etc.

ప్రధానపోషకులు.

౧ శ్రీ శ్రీ జగద్గురు విరూపాక్ష స్వాములవారు, చితాపూరు.
౨ శ్రీ శ్రీ జగద్గురు పుష్పగిరి స్వాములవారు, జనగాం.
౩ బాకరాజు పరాంకుశరావుదేశాయిగారు. యాదవరం.
౪ రామసింగుగారు- నెల్లుట్లసాపురసంస్థానములమేనేజరు- నెల్లుట్ల.
౫ శ్రీమద్వేంకట శేషారెడ్డి రామచంద్రారెడ్డి దేశముఖుగార్లు, అల్లాదుర్గసంస్థానము.

పోషకులు.

౧ శ్రీ శ్రీ జగద్గురు అభినవ విరూపాక్ష పీఠాధిపతులు, విశాఖపట్టణంజిల్లా.
౨ ఎనమండ్ర లక్ష్మీనరసింహముగారు, మర్చెంటు, బెజవాడ.
౩ రాజా వెంకటాద్ర్యప్పారావు, బహదరుగారు, వుయ్యూరుయెస్టేటు.
౪ రాజామంత్రిప్రగడ వెంకటహనుమంతరావు, రాఘవరావుగార్లు, లింగగిరి.
౫ తంగెడ నరసింహారావుగారు, కరణం, మోర్జంపాడు.
౬ శ్రీరామయాంబికా పుస్తకభాండాగారము, లక్ష్మీనర్సాపురము.
౭ లింగాల వెంకటరెడ్డి దేశముఖుగారు, కుందవరము
౮ చారబుడ్డి రత్నారెడ్డిపటేలుగారు, న్యాలపోగుల
౯ టి. లక్ష్మణసింగుగారు, జోనగాం
౧౦ నెల్లుట్ల నరసింహారావుగారు, జోనగాం
౧౧ రంగాచార్యులుగారు, ముక్త్యారు, దేశముఖు, మసీదుపల్లె.
౧౨ టేకులపల్లి కృష్ణారెడ్డిగారు, కేశవాపురము.
౧౩ జాగర్లమూడి కుప్పుస్వామినాయఁడుగారు, కారంచేడు
౧౪ పిశుపాటి వెంకటరాయశర్మగారు, కరవది
౧౫ శ్యామాపంతుల వెంకటేశ్వరరావుగారు, తహాశీల్దారు, ఇంగోలి.
౧౬ గూడూరి వీరసాంబశివరావు సర్దేశపాండ్యాగారు, మానెకొండూరు
౧౭ కొత్వాలి వెంకటేశ్వరరావుగారు, సంగెం
౧౮ లింగాల రంగారెడ్డి దేశముఖు, గణపురం,

సహాయులు

౧ వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు, చెన్నపట్టణము.
౨ బుడంపాటి సుబ్బయ్యగారు, మర్చంట్, కాకినాడ
౩ సంగెం రామారావుగారు, కుంటపల్లి.
౪ పెద్దిభట్ల వీరయ్యగారు, ప్లీడరు బెజవాడ
౫ నెల్లుట్ల కేశవరావు దేశముఖుగారు, నెల్లుట్ల
౬ రంగావఝ్ఝల రంగయ్యగారు, నర్సారావుపేట
౭ నారాయణరావుగారు, దాతారుపల్లి

అభినవ సరస్వతి

సంపుటము ౧౯ { జానపాడు
ప్రభవ సం॥ మార్గశీర్షము. } సంచిక ౯

ఆంధ్రభాషా ప్రస్తుత స్థితి — అది వృద్ధిపొందు మార్గములు.

మహాశయులారా! ఏ మతము వృద్ధిఁజెందవలయుననినఁ దన్మతావలంబకుల యొక్కయు, ఏ దేశము వృద్ధికి రావలయునన్నఁ దద్దేశవాస్తవ్యుల యొక్కయు ఏ భాష యభివృద్ధిపడయవలయునన్నఁ దద్భాష మాతృభాషగా నున్నవారియొక్కయు అభిమాన ధనాదులే ముఖ్యాధారములగును గాని యవి లోపముగా నున్నప్పుడితరు లెంత కరుణార్ద్రహృదయులై తత్తదభివృద్ధికి యత్నములు సల్పినను అంతగా సఫలములు కావు. ఎవ్వరి విధి వారభిమానపూర్వకముగ శ్రద్ధాభక్తులతో నెఱవేర్చి నపుడే ఫలితము లనుకూలముగ నుండి యాహ్లాదదాయకము లగుచుండును.

ఆంగ్లేయ భాషావిశారదులగు నాంధ్రులలోఁ బెక్కుమందికి మన భాషయందు పూర్వమంతగాఁ గానరాని యభిమాన మిపుడుకలిగి భాషాపోషకు నూతనాలంకారముల నొసంగి నవీనవికాస మీయఁగడంగుట శుభోదర్కము. మన భాష స్వతంత్రభాష కాక సంపూర్ణభాష కాక యితర భాషాధారమునఁ బెరిగి యింకను పెఱుగవలసినదగుటచేతఁ బూర్వకవిపుంగవులును బండితవర్యులును, సంస్కృతభాషాధారమున నాంధ్రభాష నింతవఱకుఁ దెచ్చి మన కప్పగింపఁగా, నిప్పటి యాంగ్లేయ భాషావిశారదులగు వారు పూర్వులకు లేని విదేశభాషా పరిచయముకలవా రగుటచే వీరికాలమున మఱెంత వన్నెకు రావలయు.

మన మాతృభాషా ప్రస్తుత స్థితిని యోచించునపుడు, దీని పూర్వస్థితి సూక్ష్మముగాఁ జ్ఞప్తికిఁ దెచ్చుకొనవలసి యున్నది. మనభాష త్రిలింగ త్రినగ శబ్దములనుండి పుట్టి తెలుఁగు, తెనుఁగని పేర్లఁదాల్చినదందురుగాని యాయా హద్దులను మించియే మన భాష పూర్వము నుండి వాడుకలో నుండుటచేతను, ద్రిలింగ త్రినగ పదములు సమాసములగుటచేఁ బ్రత్యేక పదములకేగాని సమాసపదములకుఁ దద్భవములు కానరావు గనుకను, మన భాషకును ద్రిలింగ త్రినగ శబ్దములకును

ఎట్టి సంబంధము లేదని తోఁచుచున్నది. మన పూర్వుల మొదటి భాష తెలుఁగు. దానినే యచ్చ తెలుఁగందుము. దానికి సంస్కృత సంపర్కము కలిగి రెంటికినిఁ గలిసివచ్చు నాంధ్రభాష యేర్పడినది — ఇది వివాదాంశము.

ఆంధ్రభాషాజన్మ మెట్లున్నను, ఈ భాష నభ్యసించిన మన పూర్వులు సంస్కృతభాషా గ్రంథములయందలి మాధుర్యమునుఁ జూచి తద్భాషా గ్రంథపఠన జనితానందసాగరమున నోలలాడిరే కాని యొక్క గ్రంథమయిన నాంధ్రమున వ్రాసినట్లు నిదర్శనములు కానరావు. క్రీ॥శ. పదవ శతాబ్దమునకుఁ బూర్వము తెలుఁగు కవనము లేక చాళుక్య నృపుఁడగు సత్యాశ్రయుని యాధారమున నాంధ్రకవిత వెలసెనని నన్నెచోడ మహాకవి తన కుమారసంభవ కావ్యమందుఁ దెల్పుటచేత, నప్పటినుండి క్రమక్రమముగా వర్ధిల్లిన యాంధ్రకవితాలక్ష్మి పరిపూర్ణ లక్షణశోభితాంగియై నన్నయభట్టు భారతమును బరమోత్కృష్టప్రమాణగ్రంథముగా రచియింప సహాయపడినది. లక్షణగ్రంథమునకుఁ దగిన లక్ష్యముగా నుండుటచేతనో వేదతుల్యమయి పంచమవేదమని ప్రశస్తిఁ గాంచుటచేతనో భారతకథా చమత్కృతిచేతనో నన్నయభట్టు రచియించిన భారతాంధ్రీకరణమే యాద్యాంధ్రగ్రంథమని నమ్మునంతటి ఖ్యాతి గడించినది.

అంతటినుండి కాలక్రమమున నొకదానివెంట నొకటి యిట్లు పురాణములు కావ్యములు తెనిగింపబడినవి. ఆయా కవులు రచియించిన స్వకపోలకల్పిత గ్రంథము లున్నను వాని యన్నిటికంటె భాషాంతరీకరణములకే గౌరవము వాటిల్లెను అప్పటి ప్రజల యభిరుచులు కూడ పురాణాంశముల వినుటయందు వ్యాపించియుండెడివి, ఈ యాంధ్రీకరణములే తరువాతి కవుల ప్రబంధ కావ్య శతకాది గ్రంథములకును ఇటీవల మనలోఁ వెలసిన నాటకములలోఁ బెక్కింటికిఁ గథల నొసంగుటకును నాధారములైనవి. కావున నాంధ్రవాఙ్మయాభివృద్ధికి నన్నయభట్టే మూలపురుషుఁ డనవచ్చును

ఆ భాషాంతరీకరణయుగము గతించి ప్రజల వృత్తులు వాంఛలు మారుటచేఁ బెద్దనార్యుఁడు మనుచరిత్రయను నాది ప్రబంధము వ్రాసెను. ఆతఁడు చూపిన మార్గము త్రొక్కి పెక్కండ్రు పెక్కు-

ప్రబంధముల వ్రాసిరి. ఇవి పురాణముల వంటివి కాక కేవలము కల్పనా కథలైనను గవి తన కవితాప్రవాహము స్వేచ్ఛగాఁ బ్రవహింపనీయక కొన్నికొన్ని వర్ణనము లుండితీరవలయునను కొన్ని నిబంధనలకు లోఁగ వలసినవాఁ డయ్యె. ఆ నిబంధనలకు లోఁగక వ్రాసిన ప్రబంధము లుత్తమగ్రంథములుగాఁ బరిగణింపకుండు నప్పటి ప్రజలయుద్దేశములు కూడఁ గవుల కవితాప్రవాహము నరికట్టెను. అందుచే నన్నిప్రబంధము లందును బదములు శైలిమాత్రము భేదించినను రాజు, పురము, పుష్పలావికలు, బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు మొదలగునవి తప్పక వర్ణింపఁబడియుండియుండుటయే కాక కథకూడ నించుమించుగా నొక్క తీరుననే యుండుటచే రెండుమూఁటిని జదివిన పిదప నింకఁ దక్కినవి చూడ నక్కరలే దనిపించును. ఇట్లని యీ ప్రబంధములందు గుణములు లేవని కాదు. అవి యాయా గ్రంథకర్తల వచోవిలాసమును వారివారి నడతలను వారి వృత్తులను బ్రకటింప సమర్థములే. ద్వ్యర్థి కావ్యమునకుఁ గీర్తిగాంచిన పింగళి సూరనామాత్యుఁడు కళాపూర్ణోదయమందు బ్రాహ్మణాదివర్ణనము గావించినను ప్రభావతీప్రద్యుమ్నములో మాత్రము పురము నపూర్వముగా వర్ణించి నాకలోకేశుని భూస్థలికి దింపి మనలఁ గథలో దింపి మన మనసులను మంత్రించినాఁడు.

ప్రబంధ కావ్యరచనయందుఁ గొందఱు కవులు తత్కాలపు జనుల యభిరుచులఁబట్టియో యొకనికంటె వేఱొకఁడు మించుట కుద్దేశించియో చిత్రకవనము, బంధకవనము, గర్భకవనము, ఏకాక్షరి, ద్వ్యక్షరి, త్ర్యక్షరికవనము, నిరోష్ఠ్యము శుద్ధాంధ్రము మొదలగు కఠినతమ నియమములతో గ్రంథముల వ్రాసి వారి ప్రజ్ఞ వెల్లడించిరి. ఇవియన్నియు మన భాషాయోష, తాళము చెవి పోయిన ఇనుపపెట్టెలో దాచికొనిన దాపుడునగలు. పూర్వకవు లసమానపాండితీ ధురంధరు లయినను కొన్నిశతాబ్దములలో వారు రచియించిన గ్రంథసంఖ్య మిక్కిలి తక్కువ. వారంద రుభయభాషాకోవిదులయ్యు, గ్రంథకర్తృత్వ మెక్కువ యుత్తరవాదిత్వము కోరినది కావున నేమి పరిహాసాస్పదుల మగుదుమో యని జంకియుందురు. ఇది పూర్వభాషాస్థితి.

పూర్వపు గ్రంథకర్తలయం దొకడైనను తమకు పూర్వకాలము నాటి చరిత్రగాని తమ కాలమునాటి చరిత్రగాని వ్రాయదలంపడయ్యె.

అందుచే కవులకాలము, నివాసము, శాఖ, వారుండినస్థితి, అప్పటిజనుల స్థితి వారి యాచారాదులు వారియాశయములు స్పష్టముగ మనకు దెలియక యుక్తిప్రయుక్తులతో సాధింపవలసివచ్చుచున్నది. ఆయాకాలముల చారిత్రవిషయిక నాటకముగాని నవలగాని వ్రాయువారికి నప్పటి చరిత్ర లేనిలోపము మిక్కిలి బాధగానుండి మనయిప్పటి యూహలను ఇప్పటి యాచారములను ఇప్పటి యాశయములను అట్టి గ్రంథములలోఁ జొనుపుట తటస్థమగుచుండెను. ఆలోపము పూర్తిగా ననుభవించుచుండిన మనము మనసంతతివారి యుపయోగమునకైన మనకందుబాటయిన కాలమునుండి ప్రస్తుత చరిత్రమైన వ్రాయుట యవసరము.

లోకము సదా మార్పునొందు స్వభావము కలది కావున నందుండుజనుల మనోభావములయందుఁ గూడ మార్పు సహజమే. ఆంధ్రస్త్రీలకుఁ బూర్వపు నగలయం దిష్టముపోయి క్రొత్తనగలయం దభిలాష యెట్లుకలిగెనో యట్లే మనభాషాయోషకూడ నూతనాలంకారముల నాసించినది. అవియే పత్రికలు, నాటకములు, నవలలు మొదలగునవి.

పత్రిక లేబదియువదియేండ్ల కాలమునకు లోపల నాంధ్రభాషను బయల్వెడలినవి. ఇవి యెప్పటికప్పుడే నూతనవిషయములఁ దెల్పుచు వారిబుద్ధికి నానావిధముల వికాసము సమకూర్చి నాగరికత నెలకొల్పుటకు ముఖ్యసాధనములు. ఒక్కొక్కప్పు డొక్కొక్కవిధమగు జ్ఞానసాధనములు ముమ్మరముగఁ బుట్టుట కొక్కొక్క హేతువు పుట్టుచుండును. రా॥ బ॥ కందుకూరి వీరేశలింగం పంతులవారి విధవావివాహ ప్రయత్నము చేసినపుడు తదాచార ఖండన మండనములకై కాకినాడలో మందారమంజరి రాచయోగియు, రాజమహేంద్రవరములో వివేకవర్ధనియు, విశాఖపట్టణ మండలమందలి మేరంగిలో సుజనప్రమోదినియు, మదరాసులో నాంధ్రభాషాసంజీవనియు, బందరులో పురుషార్థప్రదాయినియు, నెల్లూరిలో నముద్రితగ్రంథచింతామణియు మదరాసులోనే హిందూజనసంస్కారిణియు, ఆంధ్రప్రకాశికయు వాదప్రతివాదములఁ జేయఁదొడంగినవి. ఇన్నిటిలో నాంధ్రప్రకాశిక మిక్కిలి పురాతనమయినది. దీనివంటిదే శశిలేఖ—అది మొదలుగ నెన్నియో పత్రికలు బయల్వెడలి యాంధ్రుల యభిమానలోకమున

వించుమించుగ నన్నియు సమసినవి. ప్రజలయందు రాజకీయాంశములపై శ్రద్ధకలిగి మండలసభలు బయలుదేరిన తరువాత పత్రికాపోషణమందు ప్రజల కభిలాష కలిగినది. వృద్ధియగుచున్నది.

ఆంధ్రపత్రిక దినపత్రికగా నిర్విఘ్నముగా నడుచుచుండుటయే తార్కాణము. ప్రస్తుతకాలమందు వారపత్రికలలో కృష్ణాపత్రికయు దినపత్రికలలో నాంధ్రపత్రికయు నాంధ్రుల వివిధాశయముల నిష్పాక్షికముగ, సధైర్యముగ, వ్యక్తీకరించుచు, సాంఘిక రాజకీయ జ్ఞానదాయకములై ప్రజల మన్ననలకుఁ బాత్రములగుచున్నవి. ఆ పత్రికాధిపతులు తా మెంత కష్టమనుభవించుచున్నను, నిరుత్సాహపడక యెప్పటికయిన నాంధ్రులయం దభిమాన ముదయింపక పోవునా యని యాశించి పత్రికల నిర్వహించుచుండుట యానందదాయకము. ఆంధ్రుల యదృష్టమే. వారు నష్టములఁ బొందకుండగానైన నాంధ్రులును, ఆంధ్ర రాజులును, మహారాజులును చాలినంత యభిమానము చూపుట కర్తవ్యము.

మన సభాధ్యక్షు లాంధ్రభాషాయోషకు విజ్ఞానసర్వస్వమను గొప్ప బంగారు జడ సిద్ధముచేయింప సమకట్టిరి. మిక్కిలి నగిషీపని కోరునదియు, మిక్కిలి విలువగలదియు నగుటచేత భాషాయోష ఎంత తొందరపడుచున్నను బయల్పడకున్నది.

మన పూర్వకవులు సంస్కృతనాటకములఁ జదివి యందలి సారస్యము గ్రహించినవారయ్యు, గొప్ప విద్వాంసులయ్యు ప్రబంధకావ్యేతిహాసాదుల రచియించిరిగాని, యప్పటి రాజులకును, ప్రజలకును అభిలాష లేనికారణముచేఁ గాఁబోలు నొక్క దృశ్యప్రబంధమునైన రచియించి యాంధ్రలోకమున కీయరైరి. మహారాష్ట్ర దేశమునుండి యొక నాటక సమాజమువారు మన దేశమందలి వివిధపట్టణములందుఁ దమ నాటకముల ప్రదర్శించి ముదముఁ గూర్చి ధనము సేకరించిపోయిరి. ఆ ప్రదర్శనములే మనలో నాటకములు వ్రాయుటకుఁ బురికొల్పినవి. అందుచే నాటకములు మన భాషలో, ౧౮౮౦ ఆ ప్రాంతముల బయల్పడ నారంభించినవి. మొదట తోఁచదుగాని త్రోవఁజూపినచో మనవారు తమ సామర్థ్యాసామర్థ్యముల నెన్నక యా త్రోవను బోవుటకు మాత్రము జంకుస్వభావము కలవారు కారు. మొదట సంస్కృతనాటకములకంటె వేఱుగతి లేదు. కాన నారంభమున భాషాంతరీకరణములు

వెలసినవి. తరువాత మెల్లమెల్లగా స్వకపోలకల్పిత నాటకములు బయల్వెడసాగినవి. అవి మొదట జాగ్రత్తగా బయల్వెడలినవి కాని యీదారి బాహాటమయిన పుంతకాఁగా నలుబదియేండ్ల కాలములో నాంధ్రనాటకరచన బహుసులభమై యిది నీతిదాయకము, ఇది కాదు, ఇది యుక్తము ఇది కాదు మొదలగు విచక్షణల గమనింపక పదిపదియేను దినములలో నాటకము స్వంతముగా వ్రాయు గ్రంథకర్తలు బయలుదేరిరి మనలో బెక్కుమందికి బూర్వులకున్నంత పాండిత్యము లేదనుట సార్వజనీనము. ఇంత స్వల్పకాలములోఁ బెక్కుపుస్తకములు నాటకము లనుపేర బయలుదేరినవి.

ఆయా కాలములందు జరిగినమార్పుల సూచించు చారిత్రములున్నను, మార్లో, షేక్స్పియర్, బెంజాన్సన్, గోల్డుస్మిత్, షెరిడియన్ మొదలగు మహాకవులు వ్రాసిన నాటకములఁ బరిపరివిధముల విమర్శించి నిగ్గుతేల్చిన విమర్శనాగ్రంథములు కుప్పతిప్పలుగాఁ బడియున్నను, వాని నన్నింటిని మెలఁకువతోఁ బరిశీలించి తారతమ్య విచక్షణసేయఁగల ప్రతిభావంతులున్నను, ఆంగ్లేయభాషలో కొన్ని శతాబ్దములలో కొలఁది నాటకములు మాత్రమే రచియింపబడియుండఁగా, మహాకవియని యప్పటి ప్రభువుచేతను ప్రజలచేతనే కాక యిప్పటివఱకును నిక ముందుఁగూడ నెప్పటికప్పుడే నూతన ఖ్యాతిఁజెందు కాళిదాసుగాని, తన యసమాన కల్పనాశక్తి విపులముగా విజృంభింపఁజేసి చూపిన భవభూతిగాని యితర సంస్కృతనాటక కర్తలుగాని తమ జీవితకాలమంతటిలో నత్యల్పసంఖ్యగల నాటకములే రచియింపఁగలిగియుండఁగా నట్టివారి సామర్థ్యము లేని మనలోని గ్రంథకర్తలు రచియించిన యిన్ని నాటకములును నాటకములగునాయని యోచింపవలసియున్నది.

ఆంధ్రభాషలోఁ జిన్నయసూరిగారు నీతిచంద్రిక యను కథామంజరిని గద్యలో వ్రాసిరిగాని యది నవలయని యెవ్వరును తలంచుచుండుటలేదు. Addison అనువాఁడు Coverley గూర్చి వ్రాసిన వ్యాసములు నవలాచిహ్నము లెట్లు సూచించినవో రా॥ బ॥ కం॥ వీరేశలింగము పంతులవారి రాజశేఖరచరిత్ర మనవారికి నవలాచిహ్నములట్లు చూపినది. తరువాతఁ గొలఁది సంవత్సరములకుఁ జింతామణీ పత్రికాధిపతులు నూతనగ్రంథ నిర్మాణమునకుఁ దోడ్పడి బహుమానము

లోనంగు పద్ధతినిఁ గొన్ని నవలలను వ్రాయించిరి. తరువాత నవలారచన వృద్ధియై యాంగ్లేయభాషలో కథ ననుసరించియు పథకము ననుసరించియు, మన దేశ మందితర భాషాగ్రంథముల నాంధ్రీకరించియు గ్రంథకర్తలు నవలలు వ్రాయఁదొడంగిరి. విజ్ఞానచంద్రికామండలి, ఆంధ్రభాషాభివర్ధిని, ఆంధ్రప్రచారిణీ మొదలగు గ్రంథమాలలు బయలువెడలి యదివఱకు మన భాషయందు లేని ప్రకృతిశాస్త్రములు, సత్యచారిత్రములు, వానితోఁ బాటు నవలలు ప్రచురింపఁగడంగినవి. ఈ నవలారచన మంతకంతకు సంవత్సరములు కాదు, దినములు నడచినకొలఁది పలుచనై వారములో రెండేసినవలలను వ్రాయువారును బయలుదేరిరి. ఈ రచనాసామర్థ్యము చూడఁగా కేవలము చారిత్రాత్మక కథలే కాక ప్రజలందఱవలంబించు నానావిధవృత్తులకు సంబంధించిన చిత్రకల్పిత నవలలు, సమస్యానవలలు నిర్దిష్టోద్దేశము ప్రకటించు నవలలు, సాంఘిక నవలలు, మొదలగు నానావిధములగు నవలలు లక్షలకొలఁది రచియించిన యాంగ్లేయ గ్రంథకర్తలుకూడ మఱికొంతకాలమునకు నోడిపోదురేమో యని సందేహ మొదవునంతటి గ్రంథోత్పత్తి మనలో జరుగుచున్నది. భాషలో దృఢమగు జ్ఞానము లేదు. ఆంగ్లేయభాషలోని నవలలను పరిశీలనతోఁ జదువు నోపిక లేదు. చదువుకొనుటకుఁ దగినంత భాషాజ్ఞానము లేదు. శబ్దసారస్యము యోచింపఁ బని లేదు. అలంకారములకుఁ దడవుకొన నక్కర లేదు. కథ యల్లుటకు పేర్లుంచుటకు లోపము లేదు. ఒక రాజు ఒక స్త్రీని వివాహమాడ యత్నించుట, దానికేదో యొక ప్రబలాటంకము, రాజో మఱియెవ్వడో ముని వేషము వేయుట లేదా పెండ్లికూతురు పురుష వేషము వేయుట, ఏదో సందర్భము కలిపి పెండ్లి సేయుట యిది సాధారణ పథకము- నవలలింత సులభముగా రచియింపఁబడఁ దగినవా? యను నంశము యోచింపవలయును.

మిషనరీలు స్థాపించిన పాఠశాలలు వైద్యశాలలు మొదలగునవి మనకు మేలు సేయుచున్నవయ్యు మనలోని వారినిఁ గ్రీస్తుమతములోనికిఁ దీసికొనినట్లే యాంగ్లేయ భాషాపరిచయము మనకును మన జ్ఞానమునకును అద్భుతవికాసము కలిగించినను, మన భాషనే మనము మఱచునట్లును, ఆంగ్లేయభాషాపదములు వాడకుండ మన నిత్యకృత్యముగా

జరుపు సంభాషణమైన జరుగకుండునంతటి స్థితి తెచ్చినది. పారిభాషిక పదములు చేర్చినఁ జేర్తురుగాక. తెలుగున మాటలాడిన బోధపడని స్థితియు వచ్చినది. ఆంగ్లేయభాషతోనేగాని యుపన్యాసము లీయలేని యాంధ్రవిద్వాంసు లున్నారు తెలుఁగుపత్రికలు విప్పనివారలు కలరు. ఆంధ్రపత్రికాధిపతి సంవత్సరాదికి నేటేట నొసఁగు నమూల్య గ్రంథములు వచ్చి తమవద్దపడియున్నను, బొమ్మలు చూచి యా గ్రంథ మావలఁబడవేయువారలును గలరు. భాషలో దార్ఢ్యము, మన దేశమందలి వస్తువుల సారముతోఁబాటు తగ్గుచున్నది. మన బాలురు తెలుఁగు గ్రంథము చూడకయే విద్యాసమాప్తి సేయు మార్గము లేర్పడినవి. విద్యార్థులు భాషాపరిశ్రమము సేయుట కవకాశములు లేకయున్నవి. సంస్కృతభాషాపాండిత్య మటుండ దాని పరిచయమే దూరమగుచున్నది. ఆంధ్రాంగ్లేయ గీర్వాణభాషాకోవిదులు గ్రంథములు వ్రాయమానిరి. కాళిదాసు, నన్నయభట్టు, పెద్దనార్యుఁడు మొదలగు విద్వాంసుల కమరిన రాజసన్మాన మిప్పటి విద్యావంతుల కిచ్చు ప్రభువు లరుదు. భాషాపాండిత్యము లేకయే, యది సేకరించు యత్నములు సేయకయే, యేదోవిధముగా గ్రంథముల వ్రాసి, యే గ్రంథమాలాధారముననో, స్వంతముగ వ్యయముచేసియో, తనయందభిమానముగలవారినిఁ జందాల నడిగియో, పుస్తకమమ్మి యిచ్చు వెచ్చమిచ్చెదనని ముద్రాశాలాధికారుల నమ్మించియో నెట్లో ప్రచురించి పొగబండ్లలోఁ దమ గ్రంథముల నమ్మించు గ్రంథకర్తలు బయల్వెడలిరి. గ్రంథరచన తుద కెంత చులకన యైనదన నేవృత్తి యమరక గ్రంథముల వ్రాసి యమ్ముకొనవచ్చునను గ్రంథకర్తలు కూడ గలరు. గ్రంథసంఖ్య వృద్ధియగుచున్నది. కాని భాషాజ్ఞానములో దార్ఢ్యము నెమ్మదిగా తగ్గిపోవుచున్నది. క్రింద నెలుకలు గోడ దొలుచుచుండుట కనిపెట్టక గోడమీద జిత్తరువులు చెక్కుచూచుచున్నాము. చెట్టుపుల్ల విఱుగనారంభించినది. దానిపై కెక్కుటకు పరదేశలతలనుపాతుచున్నాము

వజ్రములదాపి మేలిమిబంగారు కడ్డీతోఁ జేయఁబడిన యమూల్యాలంకారముల దాల్చి కులికిన భాషాసతికి గుల్లనగలు కృతకాలంకారములు సమకూర్చి దేహమునిండ నగలమరుచున్నవనుకొనుచున్నాము. ఇది మన ప్రస్తుత భాషాస్థితి. ప్రస్తుత గ్రంథకర్తల స్థితి చూడగా

The club of Authors అను రెండు వ్యాసములలో జెప్పినట్లు Goldsmith నాటి గ్రంథకర్తల స్థితి వచ్చినది.

ప్రస్తుతము వ్యాపకములో నున్నవి నాటకములు నవలలు. ఏయే విధులననుసరించినచో నీ గ్రంథరచనా పద్ధతి యుక్తముగనుండునో భాష చక్కగా వృద్ధిబొందుటకు నింకేయత్నములు చేయవలసియున్నవో మనము యోచింపవలయు.

ఒక కవి చేసిన యాంధ్రీకరణ మింకొక కవికి సరిపడక యొకొక్క నాటకమును పలువురు తెలిగించియున్నారు. ఈస్థితి రామాయణమునకు తటస్థమైనది. కాని భారతము మాత్రము మనపూర్వు లందఱు పరమప్రమాణ గ్రంథముగా నెంచి తిరిగి యాంధ్రీకరింప దలంపరైరి. ఆలోపము శ్రీయుత శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు తొలంగించుచున్నారు. ఒకభాషలోని గ్రంథము అట్టి శబ్దసారస్యము లేని మఱియొక భాషలోనికిఁ దెచ్చుట దుర్ఘటకార్యమైనను నాటకమందలి పాత్ర పోషణమునకు కథా చమత్కారమునకు అలంకార భావములకు నాటకకర్తయే యుత్తరవాదిగాని యాంధ్రీకరణమం దుపయోగించిన శైలికిని వాడిన శబ్దములకు భావములను చక్కగా వ్యక్తీకరించుటకు వృత్తులకు, ద్రాక్షాది పాకములకును రీతులకును ఆంధ్రభాషాకర్తయే యుత్తరవాది. సంస్కృతాంధ్రములలోను సమానమగు పాండిత్యముండి యాంధ్రభాషలోఁ జక్కగా మృదుశైలితో వ్రాయుసమర్థత కలవారు చేసిన భాషాంతరీకరణములు శ్లాఘనీయములై భాషకు మేలు సేయును. సంస్కృత భాషాజ్ఞానము లోటుగా నుండెనా, మాతృకలోనున్న భావములు రావు. సంస్కృతమందు మంచి పాండిత్యమున్నను ఆంధ్రములో వ్రాయ నేరక యుండెనా యా తెలుగున కర్థము తెలియదు. దిక్ప్రదర్శనముగాఁ గొన్నిటినిఁ జూపుచున్నాను. భవభూతి వ్రాసిన యుత్తరరామచరిత్రను కావ్యనాటకాలంకార పాణినీయ వ్యాకరణుండనని చెప్పికొనిన యొకకవి తెలిగించుచు దుర్ముఖుఁడు వచ్చి రామునితో రామమహీపాలుని మూలమున దశరథుని మఱచితిమని ప్రజ లనుకొనుచున్నారని చెప్పగా రాముఁ డేమనె ననఁగా - అది స్తోత్రపద్ధతి - ఏది మాఱుసేయునట్టి దోషంబు చెప్పుము అనియడిగెను మాఱుసేయునట్టి దోషమన నేమియో తెలియదు.

రాముని భావ మేమనఁగా దోషములున్నఁ జప్పుము. ప్రతిక్రియ సేయుదునని— పురుగుల తోఘలే భూరుహంబులనిండు - పురుగుల తోఘు లనగా పురుగు లున్న చెట్లబెరడనిభావము - జనస్థానే శూన్యే యను శ్లోకములో సీత లేకపోవుటచే జనస్థానము శూన్యముకాగా యనుదానికి దుష్టదానవతతి శూన్యమైన యని యాంధ్రీకరింప బడియె. రాముని కష్టావస్థచూచి శిలలుకూడ కరిగిపోయినవను భావ మునకు శిల యలోయని యేడ్చునోయని వ్రాయంబడియె. కూతురి విరహంబని వ్రాయంబడె. కూతువిరహమనుట యుక్తము. అచ్చు పొరపాటనకుండ శేఫము ప్రాసాక్షరము-మనంబు రణంబట్టుల వేచు- ఇచ్చట కురుపునకు రణమని ప్రయోగింపఁబడినది. రణమన్న యుద్ధము. కురుపునకు వ్రణమందురు. అచ్చుపొరపాటుకాదు, మత్తేభములో "ర" ప్రాసాక్షరము-గూండ్లకు గూళ్ళు, రావికర్రకు పప్పిలీదండమని వ్రాయ బడె. పిప్పలీదండ మన పిప్పలి తీగయగును, ఇట్టి భాషాంతరీకరణములు విద్యార్థులకుగాని భాషకుగాని మేలు సేయకపోవుట యటుండఁ గాల క్రమమున భాషకు హానికరము లని పెక్కుమంది యభిప్రాయము.

ఇంక స్వకపోలకల్పిత నాటకములలో గొన్ని యుత్తమమయి నవి కలవు. కొన్ని కళ్ళెములులేని గుర్రములు- పాత్రపోషణముగాని నాటక కథాకాలమందలి మతాభిప్రాయములకు సరిపోవుటగాని కాన రాదు. మనయిప్పటి యూహలను, మన యిప్పటి యాచారములను, మన యాహారములను మన యిప్పటి సాంసారిక లక్షణములను దేవ తలను దేవతాంశ సంభూతులను గురించి వ్రాసిన నాటకమందు వారి కారోపించుటయు, మనుష్యులను గురించి వ్రాసిన నాటకములందు దేవతాలక్షణము లారోపించుటయు యుక్తముకాదు. కావుననే నాట కము కొన్ని కట్టుబాట్లకు లొంగితీరవలయు. బాటలలోను పుంతల లోను పోదగిన బండి రైలుపట్టాలమీద బరుగిడు పొగబండి కానేరదు. పుస్తకము ముద్రిత మాయినదనియు నెక్కుడుగా నమ్ముడువోవు చున్న వనియు తలంచి గ్రంథ ముత్తమమయిన దనరాదు. గాజుతాలు వజ్ర ములకంటె విశేషముగా నమ్ముడువోవుట వింతగాదు.

నిరంతరము లోకము పొందు మార్పులును, సంఘమందు జరుగు మార్పులును, పరుల దండయాత్రలును, మహాత్ములు సేయు

కార్యములును, ధర్మాత్ముల దానంబులును, శూరుల సాహసకృత్యములును, లోకోపకారధురీణుల స్వార్థత్యాగమును మొదలగున వన్నియు కవివైపు చూచుచుండును. కవియేగదా తత్తత్కార్యముల లోకమందు శాశ్వతముగా నిలుచునట్లు సేయువాఁడు. కావునఁ గవియగువాఁడు తన స్వకీయశక్తిని (Individuality) నవీన కల్పనాశక్తిని (Originality) వినియోగించి యా కాలమందలి లోకస్వభావమునకును మానవస్వభావమునకును తనభావములకును సంబంధ మేర్పఱచుకొని యట్టి సంబంధమును తనభాషాసామర్థ్యముచే మనోహరముగ వ్యక్తీకరించి చదువరుల హృదయములఁ దనకవితారసముతో నింపి మెత్తబరచి చిన్మయత్వ మొందునట్లుసేసి కలతఁజెందిన హృదయము కలవారికి శాంతియు, దుఃఖితులకు నోదార్పును, సుఖవంతుల కధిక సంతోషమును, పిరికివారికి ధైర్యమును, లోభులకు దాతృత్వమును, తృప్తిని లేనివారికి సంతృప్తిని కలిగించి తాను వ్రాయబూనిన కథతోఁబాటు తాను చదువరుల లేక ప్రేక్షకుల హృదయక్షేత్రముల నాటదలంచిన సీత్యాదిపాత్రముల నాటవలయు. ఈ కార్యము కావ్యములును నాటకములును చేయవలయు. కావ్యములు చదువుకొను వారికే యానందమును గూర్చునుగాని నాటకము లొక్కసారిగా బెక్కుమందికి నామోదముగూర్చునవి, కావున మనపూర్వులును ఆంగ్లేయులును చక్కని నిబంధన లేర్పఱచి వానితోబాటు పథకమునకు (Plot Development) నైదుసాధనము లుపదేశించిరి.

మొదటిది ముఖము. The exposition, or introduction. రెండవది ప్రతిముఖము- The complication rising action or growth. మూడవది గర్భము- The climax, crisis, or tying the knot. నాల్గవది విమర్శనము- The resolution foluing action or consequence. ఐదవది నిష్ఠ The demouncement or conclusion final event. మనపూర్వుల నాటకముల గాని యాంగ్లేయ నాటకములగాని యాయా నియమిత పద్ధతుల ప్రకారము విమర్శించి చూచినయెడల పథకమున కనుగుణముగ నెంత నిపుణతతో కథ యల్లినదియు ఆకథ నల్లుట కత్యవసరమగు పాత్ర లెట్టి విధముగా సప్రయోజనముతో దెచ్చినదియు ఎంత యధమపాత్రమైనను లేని

యెడల నాటక కథ కెట్లు భంగము వచ్చునదియు ఆ యా పాత్రలు వచియించు పలుకులు కథకు సందర్భము లేని తుక్కు ప్రసంగము గాక కథ కేదోవిధముగ నెట్లు సంబంధ పడునదియు తెలియనగును. వేణీసంహారములోని రుధిర ప్రియునియొక్కయు వసాగంధయొక్కయు ప్రసంగమువలన యుద్ధ మెంతజరిగి యెవ్వరెవ్వరు మరణించిరో తెలియును. మొదటి యంకములో బుద్ధిమతికా ప్రసంగమువలన భీముడు ప్రతిజ్ఞ పట్టును. రిచ్చర్డు III నాటకము లోకూడ మొదటి రంగములో రిచ్చర్డుయొక్క యుద్దేశము తెలియనగును. అంతటినుండి తదుద్దేశము నెరవేరుటకు నేమేమి యత్నములజేసి యంతకంతకు ముడి బిగియ ద్రోయుచు కార్యసాఫల్యమునకై యెట్లవసరమగు వారితో ప్రసంగించినదియు వరుసగా తెలియును. నాలవయంకము రెండవరంగ మారంభమందే నాటకపుముడి పూర్తిగా బిగియును. టవర్‌లో నున్న యన్న కుమారుల జంపుమని బకింగుహాము నడిగినపుడు అదివఱదాక సహవాసిగా నుండి దారుణములకు దోడ్పడినవాడు విముఖత్వము జూపుటయే విమర్శము (Falling action) కు ఆరంభమైనది

ఈ దృష్టితో మన నవీనకల్పిత నాటకములం జూచితిమేని వానియందలి లోపములం గనిపెట్టగలము. నాటకము వ్రాయునపుడు తా నేర్పఱచిన నాయకుం డెట్టివాఁడయినను, వానికిఁదగిన యౌచిత్యమిచ్చుటయు, తన కథాంశమునకు భంగము వాటిల్లు. లేక సందర్భము లేని ప్రసంగము వానినోట రానీయకుండుటయు, ఏపాత్ర ప్రసంగమా పాత్రస్థితికి దగినట్లుండుటయు చూచుకొనవలయు. ఆంగ్లేయ నాటకములందును, సంస్కృతనాటకములందును విదూషకు·లుండిరి గాని గయోపాఖ్యానములోని విదూషకునివంటివాఁడు గ్రంథకర్తకు లభ్యము కాలేదు.

నాటకాలోకనమందు పండితులును పామరులును ఉండకపోరు. కావున వర్ణనౌన్నత్యము, అలంకారసంపద, భావవ్యక్తి మొదలగునవి సరసశబ్ద సమ్మేళనమున సులభశైలిని వ్రాయవలయు. అలంకారములు ప్రేక్షకుల యూహాల వ్యాపింపఁ జేయునవిగా (Suggestive) నుండవలయును. నాటకమును రచియింపఁగానే యచ్చువేయింపక నెమ్మదిమీఁద దాని మంచిచెడ్డలరసి, యొకటి రెండుసారులు ప్రయోగించి

ప్రేక్షకుల యభిమతముల గనిపెట్టి యవసరమగుచోట్ల సవరించుకొని ప్రచురించుట మంచిదని యెంచి కాబోలు పోతుకూచి సుబ్బయ్య ఎమ్. ఏ గారు తమ శ్రీకృష్ణతులాభారమను నాటకమును ప్రచురింపరైరి.

మనలోని కావ్యప్రబంధ నాటకములు మంగళాంతములుగా రచియింపఁబడినవే కాని విషాదాంతములుగా ముగింపఁబడు చుండుట లేదు. ఆద్యంతముల మంగళమే యుండవలయునను పూర్వుల యాచార మనుసరించి విషాదాంతముగా ముగియవలసిన సారంగధర మొదలగు కథలకు నేదో సిద్ధదర్శనము కల్పించి బలవంతముగా మంగళాంత కథలగా మార్చుచున్నారు.

జగమే యొక మహానాటకము. లోకభావమే విషాదాంతము. నరుని జీవితమే విషాదాంతము. ఒకఁడు మరణించిన తరువాతనే వాని గుణముల నెంచుచుందుము. మన నాటకము లేల విషాదాంతములుగా నుండరాదు? విషాదాంత నాటకములను చూచినప్పుడే యాయంశము చిరకాలము మన మనసులో నిలిచి యేవేవో యాలోచనలు తోఁచుచుండుటచే మనసునకు వికాసము గలుగుచుండును. సుగుణమణి వంటివి ఒకటో రెండో యట్టివి కలవు. శ్రీరాజా వేంకటాద్రిఅప్పారావు బహద్దరువారు (ఉయ్యూరు జమీందారువారు) రచియించిన దుర్యోధనాంతమను నాటకమొకటి యీమధ్య వెలసినది. ఆంగ్లేయ భాషా విశారదు లీనాటకముల నింకను వ్రాయవలయును.

ఇప్పుడు మనలో విశేషముగా వ్యాపించుచున్నవి నవలలు. దేశమందు నూతనశక్తిని గలిగించుటకు సాధనములు. రచనయందు యతిప్రాసలకై తడువుకొననక్కఱలేక గద్యగా విపులముగా వ్రాయవచ్చును. చదువరులయినను పద్యములకంటె సులభముగా నర్థము చేసికొందురు. కావ్యములు, నాటకములు, నవలలు, ఒకరీతి మేలునే దేశమునకుఁ జేయును. కావ్యములు వ్రాయుట కష్టము. చదువరులం గూడఁ గొంత పాండిత్యము కోరుచుండును. నాటకములో కవి తానుద్దేశించిన కథ యథార్థముగా జరుగుచున్నట్లే చూపించి ప్రేక్షకుల మనములను దత్కాలమునకుఁ గొనిపోవును. ఇంక నవలయందో కవిమాత్రము వాక్రూపమునఁ గనంబడి యన్నిపాత్రల పలుకులు తానే

పలుకుచు చదువుచున్నవారి కానందము గూర్చుచుండును. కావున నాటకరచన యెంతకష్టమో నవలను రచియించుటయు నంత కష్టమే. నాటకమందుఁబోలె నవలయందును, అవసరమగు పాత్రలనే తీసికొని రావలయును. ఈగ్రంథములు చిన్న గడియారములవంటివి. ఏ చిన్న చక్రము తీసివేసినను జేబుగడియారము యాగిపోయినట్లే, నాటకమందు గాని నవలయందుగాని కవి తెచ్చిన పాత్రలలో దేనినిఁ దొలఁగించినను కథ నడవనట్లుండవలయును. దీనినిఁ దీసివేసిన, కథకు నష్టము వాటిల్లదని విమర్శకులకుఁ దోఁచియరాదు.

కథానాయకునిగాని మఱియొకనిగాని సేయు వర్ణనములందు స్వార్థత్యాగి, ధర్మాత్ముఁడు, తాను న్యాయమని నమ్మిన కార్యములను పట్టుదలతోఁ జేయును. పరోపకారి, మతాభిమాని యిట్టిముడిమాటలు వేయక తా నేయే గుణములు పాత్రము నారోపింపఁదలంచెనో యాయా గుణముల వ్యక్తీకరించు కార్యములా పాత్రలచేఁ జేయించి యా గుణములఁ జదువరు లూహించునట్లు చేయవలయును. స్థలవర్ణనము సేయునపుడు పనికిరాని సందుగొందులు వర్ణింపక కథకు సందర్భించు స్థలము మాత్రము చదువరుల హృదయములందు పటముగా నేర్పరింపవలయును. నవలయందుఁ గవి సేయువర్ణనములు నాటకమందలి తెరలవంటివి. నాటక మాడుచున్నప్పుడు మధ్య మధ్య తెర వేసి తిరిగి తెరతీయుట యాలస్యమగునెడల నా యాలస్యము దుస్సహమై ప్రేక్షకులు తెరతీయించుటకై చప్పటులు కొట్టుట, యీల వేయుట మనము చూచుచున్నాము. అలాగుననే కథామధ్యమున వర్ణనాభాగ మతిశయించిన కొలఁదిఁ జదువరులకు విసుఁగుతోఁచును. తెరను వేయకుండరాదు. వేసి చిరకాల మట్లే యుంచరాదు.

మన నవలలలో నించుమించుగా నన్నిఁటియందును రాజే ప్రధానుఁడు. నవలకు రాజే నాయకుఁడుగానుండ నవసరములేదు. మన బుద్ధి వికాసమునకు రాజులచర్య మాత్రమే యవసరము కాదు. ఆయా కాలముల దేశమం దేయవస్థ లుండినవో, అప్పటి సాంఘికలక్షణము లెట్టివో, ఏయే పరిశ్రమ లభివృద్ధి నొందెనో, అప్పటి నాగరికతా లక్షణము లెట్టివో, ప్రజల యాశయము లెట్లుండెనో, యిట్టి యంశములు చరిత్రలయం దంతగా నుండవు. ఉండినను పొడిమాటలతో నుం

డును. ఇంక నవలయందో యీ యంశములే కథతో సందర్భపఱుపంబడి వర్ణనలతో, మృదుశైలితో, కవి పలుకుల జదువుదురు. కాన నవి మనసులో నాటుకొనియుండును. దేశచరిత్రలును దేశాభ్యుదయమున కవసరమగు జ్ఞానమొసంగునుగాని యవసరముండిగాని చరిత్రలను సాధారణముగాఁ జదువము. అవసరములేక వినోదమునకైనను నవలలనుఁ జదువ నభిలషింతుము.

కథ రసపుష్టిగ నుండుటకు జరిగిన కథకుఁ గొంతకల్పిత కథను పాత్రలను జేర్చినను ఈస్వాతంత్ర్య మున్నదిగదా యని మానుషశక్తికి మించిన కార్యము లాయా కథానాయకులచే జెప్పించి నపుడును, ఆయా చేష్టల జేయించి నపుడును, నవలయొక్క ధర్మమే చెడిపోవును. కథానాయకుఁడు కూడ మనుష్యుడే. దేవతలనుఁ గూర్చి నవలలను వ్రాయుచుండుట లేదు. వాఁడెంత వీరుఁడయినను, ఒక్క దెబ్బయైనఁ దినకుండ వేయిమందిని జంపెననుట యమానుషము. ఎంత బలవంతుఁడయినను పర్వత మెత్తుకొని పోలేడు. ఎంతటి నేర్పరియైనను ఱెక్కలకుఁ జేటలను గట్టుకొని తాను పోదలంచిన మేడమీద కెగిరిపోలేడు. ఇట్టి యమానుషాద్భుత చర్యలు నవలయం దుండరాదు. ఇఁక ప్రకృతిని మానుష స్వభావమును అనుసరించినను, ఉచితానుచితములు, ప్రస్తుతాప్రస్తుతములు, అవసరానవసరములు కాల తారతమ్యములు, బహునిపుణముగా గమనింపవలయు. అశోకుని కాలము నాటి కథనో ఔరంగజేబు కాలమునాటి కథనో వ్రాయుచు మనకిప్పుడిప్పుడు వెలసిన మోటారు బండ్లను, మన ధాన్యపు మరలను జేర్చిన నది సరియగు నవల యగునా ?

ఆంగ్లేయులు నవలలను లక్షలకొలదిగ వ్రాసిరి గాని చరిత్రలున్నను చరిత్రాత్మక నవలలు మిక్కిలిగాఁ దక్కువగా నుండుటయే కాక నవలా రచన యారంభమయిన తరువాత నలువది యేండ్లకు మించిన కాలమునకుగాని చరిత్రాత్మక నవల బయలు దేఱలేదని తజ్ఞులు చెప్పుదురు. అట్టిది మనభాషలో సరిగా నూఱయిన నవలలున్నవో లేవో సగమునకుఁబైగా చరిత్రాత్మకనవలలే. చరిత్రాంశము చేర్చినంతనే చరిత్రాత్మక నవలయని తలఁచుట పొరబాటు. సత్యాంశమునకుఁ గల్పితాంశమునకు సందర్భ మేర్పఱచుట యందును, నవల

కవసర మగునంతకథను తీసికొనుటలోను కవి మిక్కిలి చతురుడై యుండవలె. కావున నవలలును నాటకములును మనమనుకొనునంత సులభవిషయముగాదు. ఈ లక్షణముల గమనింపక వ్రాసిన నాటకము నాటకముకాక ప్రశ్నోత్తరి యగును. నవల నవలకాక పిట్టకథయగును.

ఆంగ్లేయ భాషాకోవిదులగు మనవారు పలుతెగలగు నవలలు సర్వలక్షణములతో రచియించి ప్రచురించిన గాని నవలరచన సుష్టుపడదు. సరియైన నాటకములు నవలలు బయల్వెడలుటకు విజ్ఞాన చంద్రికా మండలివంటి విమర్శకమండలి బయల్వెడలి Raleigh cross మొదలగువారి నవలాలక్షణము నవలావిమర్శముకల గ్రంథములు ప్రచురించి బయలుపడిన గ్రంథములు విమర్శించి ప్రచురించిన గాని మన వాఙ్మయము చక్కని వృద్ధికి రాదు. ఉర్లాము సభలో యోగ్యతాపత్రిక పుచ్చుకొనినచో వేదపాఠకుని యెట్లాంధ్రలోకము తలంచుచున్నదో యావిమర్శక మండలివారివిమర్శనమున కాగిన గ్రంథమే మేలని గ్రంథకర్తలకు దోపింపవలె. అట్టి సరియగు గ్రంథమునకే పరీక్షాధికారులును, సర్వకలాశాల వారును, ప్రబలులగు గ్రంథాలయములవారును ప్రోత్సాహ మిడవలయును. ఇట్టి మండలిని స్థాపింప మన యాంధ్ర ప్రభువులుపూనుకొనవలయును. పత్రికాధిపతులును గ్రంథము రాగానే యేదో తోచినవిధమున వ్రాయక బాగుగా విమర్శించి మొగమోటమి లేకుండ సత్యాభిప్రాయము ప్రకటింపవలె. ఇది మొదట గ్రంథకర్తలకు గ్రంథవ్యాప్తికి నాటంకముగా నుండిన నుండుగాక. కాలక్రమమున భాషయు గ్రంథరచనయు బాగుపడును. అంతేగాని యేవో పది పుస్తకములు బయలు దేఱుట యంతయు భాషాభివృద్ధియే యని తలంచిన నుబ్బుజాడ్యము వచ్చినవాడు కూడ తన దేహము లావెక్కుట చూచి బలియుచున్నట్లు సంతోషింపవచ్చును. వంశాభివృద్ధికి కుంటివారు, గ్రుడ్డివారు, మూగవారు, అప్రయోజకులు, దుష్టులు, ఎవ్వరో యిట్టివారు, పదిమంది బయలుదేఱుటయే చాలునో, అందరిచే నుతియింపబడు దీర్ఘాయుష్మంతుడును సుగుణవంతుడును నగు పుత్రుడొకడయిన గలుగుట వంశాభివృద్ధియో మీరలే యోజింపవలయును. విమర్శనము తిరుగుచుండు కుమ్మరి సారె వంటిది. సరసగ్రంథము రసముతో గూడినది కావున మెత్తని

మంటిముద్ద యనవచ్చును. విరసగ్రంథమందు రసముండనుగాన నెండిన మంటిముద్ద వంటిది. తిరుగుచున్నసారెపై వేసిన మెత్తనిముద్ద పాత్రె వంటుకొనును, ఎండిపోయినముద్ద త్రుళ్ళి దూరముగాఁ బడిపోయి చితికిపోయినను పోవును.

విద్యావంతులు తమదృష్టి యొకసారి విద్యార్థులపైకిఁ ద్రిప్పవలయు. చిన్నతరగతినుండియు బాలురకు నాంధ్రభాషపైనభిమానము పుట్టించువారు లేక మొదటినుండియు భాషావిముఖు లగుచున్నారు. మిడిల్‌స్కూలునందు బోధకులయినను మనభాషలో గ్రంథములు చదువనిస్కూల్ ఫైనల్ వారు. కావున దొరతనమువారు తగనసహాయమొసఁగి ప్రతిమిడిల్‌స్కూలునందును ఆంధ్రగీర్వాణ పండితుల నియమించునట్లు చేయవలయును.

సర్వకళాశాలా పరీక్షలకు బోవువారు తెలుగునమున్న రెండు నవలలను చదివి వాక్యరచన చేయవలయు. భాష నెఱుఁగని వాక్యరచన యెట్లుసాధ్యము? పరీక్షలకు నిర్ణయించు నాంగ్లేయ గ్రంథ బాహుళ్యము తగ్గించి తెలుఁగున పఠనీయగ్రంథముల నిర్ణయించి యాంగ్లేయభాష నొకభాగము, తెలుఁగొకభాగము ఇష్టానుసారపాఠములు రెండొకభాగము నిట్లు మూఁడుభాగములుగా నింటరుమీడియేట్ పరీక్షావిధానము మార్పింప వలయు. పట్టపరీక్షకుఁగూడ మాతృభాషలోఁ బరీక్ష జరుగవలయును

ఆంగ్లేయభాషలో నాల్గవ యైదవ తరగతి బాలురయినఁ జదువుకొనునంత సులభశైలితో చక్కనికథలు కుప్పలు తిప్పలుగా నున్నవి. మనలో మూఁడవఫారమువాఁడు మాతృభాషలో జదువుకొనుటకు పాఠపుస్తకములు తప్ప నితరగ్రంథములు లేవు. సుబ్బారావుగారి యార్యకథావళి కొంతవఱకీలోపము తీర్చినను, ఇంకను బయల్పడవలె. భారతాది గ్రంథములపై విపులముగా విమర్శనలు బయల్పడవలె. విద్వత్పరిషత్పత్రిక ప్రతి మాసమునను గ్రంథవిమర్శనము ప్రచురింపవలయు.

యుద్ధముచే వాగిపోయిన మండలులు మాలలు తిరిగి తలయెత్తి యుత్తమగ్రంథరచనకు యత్నములు సలుపవలయు. ఇట్లు సరియైన పద్ధతులమీద భాషాభివృద్ధి జరుగుచున్నప్పుడు జమీందారులును రాజులును, మహారాజులునుయూరకుందురా ? కృష్ణదేవరాయ భోజ చరిత్రల వినియుండరా.

అగస్త్య సంప్రదాయము.

కలకత్తాలోని 'రూపమ్' పత్రికా సంపాదకుడైన, ఓ. సి. గంగూళీగారు బెంగుళూరునందు 'మిథిక్ సొసైటీ' వారి సమావేశమునందగస్త్యమహర్షిని గూర్చి యిట్లుపన్యసించిరి: —

ప్రాతఃకాలమునందుఁ దొలిదెస భానుబింబ ముదయించి ప్రాగ్దిక్కున కొలందియు దనకాంతి పుంజముల జగము నాల్గువైపుల వెదజల్లు నటుల ప్రతి మహా మతమును నొక్కచో నుద్భవించి కాలము గడచిన కొలదియు భూలోక మంతట విస్తరిల్లును. క్రీస్తుయొక్క సందేశము కొలది సంవత్సరములలో ప్రపంచపుఁ జివరలకు బ్రాకి యిదివరకెన్నడెఱుంగని సంద్రములు గూడ దాటిపోయినది. మహామ్మదు ప్రవక్తచే సృష్టింప బడిన ఇస్లాము ధర్మ మరేబియా యెడారులనుండి కొన్నాళ్ళు లొట్టిపిట్టలపై మంద మందముగ ప్రచార మొనర్చి యటుపై మనోజవములగు నశ్వదళములనెక్కి ప్రపంచమంతట సంచరించినది. అటులనే హిందూ విజ్ఞానప్రచారకులుగూడ శాశ్వతముగా స్వదేశమునందు నిద్రింపలేదు. కాషాయవస్త్రములు ధరించి, చేతఁ ద్రిశూలములు దాల్చి, వారును, హిమావృతములైన కొండకోనల, నదీ నదమ్ముల, సముద్రాఖాతముల లంఘించి సకలమానవుల కమృత విద్యను ప్రసాదించి యుండిరి. మొట్ట మొదట పాంచాల పంచనదీ పరిసరమ్ముల నిబద్ధమైయుండిన యార్య విజ్ఞాన మతివిశాలమై తూర్పున కెగదొట్టి, గంగాతీరము వెంబడి విస్తరిలి, దక్షిణాభిముఖమై,

మంగళదిశ, యనంబరగు నుత్తర దేశమునుండి వినవచ్చు దివ్యసందేశ ముల స్వీకరింప సంసిద్ధులైయున్న దక్షిణాపథవాసుల సంతృప్తి నంద జేసి యేవిధమ్మున సర్వోత్కృష్టముగ విజృంభించెనో యట్టివిధమతి కుతూహలప్రదము. అగస్త్య మహర్షియను నతఁడొకప్డొక శరీ రియై యుండెనన్నను, లేక నతఁడొక కల్పిత వ్యక్తియన్నను, నా మహర్షినామమనుమాత్ర మప్పటి యార్యవిజ్ఞాన వ్యాపకులు, తమ విజ్ఞాన ప్రచారమునకును, వంసభోయి యుండుటకును క్రొత్త క్రొత్త భూముల ద్రొక్కి చూచిరని చెప్పుటకు దగిన ప్రబలసాక్ష్యముగా నున్నది. దాక్షిణాత్యులలో నార్యవిజ్ఞానబీజముల వెదజల్లవలయునని యచ్చటివా రాయనను గోరియుందురు. వెంటనే యీ మహర్షి దక్షిణా పథమునకు ప్రయాణము కట్టెను. దక్షిణాపథమునం దగస్త్య మహర్షి యడవులను గొట్టి జనావాస యోగ్యములుగ జేసినటు లనేక కథ లున్నవి. అందొకటి తమిళవై య్యాకరణియైన నచ్చినార్కిని యారు వ్రాసినాడు. ఈ యంశమే శ్రీమద్రామాయ ణారణ్యకాండములో 'దక్షిణ' దిక్కృత పనశరణ్య పుణ్యకర్మణా' యని విస్పష్టముగ వ్రాయబడి యున్నది. దక్షిణదేశమునం దప్పుడప్పు డామహర్షి వస్యాసం స్థాపించిన యాశ్రమములను బట్టియే యాయన చారిత్రము జాలవరకు దెలిసికొనవచ్చును. అగస్త్యుడు దక్షిణాపథ మంతటను నార్యజనుల యావాసములచే నింపివైచెను. అట్టియెడ నేతత్పూర్వ నివాసులకును వీరికిని గలహములు సంప్రాప్తించినవి. ఈ పూర్వ నివాసులనే యసురు లనియు రాక్షసులనియు బిలుచుచుండిరి. ఈ యుద్ధములలో ననేకప్రదే శములయం దగస్త్యమహర్షి పరసైన్యముల నోడించి విజయము గొన్నటుల గన్పట్టుచున్నది. టాలమీచే కథితములైనఐవలి, బటపీప్పు రల్ పట్టణములం దగస్త్యుడు రాక్షస సంహారము గావించెనట. ఇప్పుడీ పట్టములు, అయిహోలు, బాదమీలని పిలువబడుచున్నవి. ఇయ్యెడఁ గడుపురాతనములైన దేవాలయము లున్నవి. ఈ దేవాలయము లగస్త్యు డీపట్టణములందు వొలుత నార్యవిజ్ఞాన బీజములను నాటిన నాటినుండియు వర్థిలు చుండవచ్చును.

"సిన్నమన్నూరు" శాసనములను, తక్కిన దృష్టాంతములను బట్టి చూడ, నాకాలమునం దగస్త్య మహర్షి యార్యవిజ్ఞాన ప్రచారము సేయుచు స్థానిక ప్రభువులను వశపఱచుకొని కాలక్రమేణ వారందరకును గురుస్థానము వహించెనని యూహింప వచ్చును. సుందర పాండ్యమహారా జగస్త్యశిష్యుడుగా పేర్కొనబడినాడు. అగస్త్యమహర్షి శైవమత స్థాపకుడగుటయే గాక వైద్యగ్రంథనిర్మాతయు, ద్రావిడ లిపి సంస్కర్తయు, ద్రావిడ వైయాకరణియుగా విలసిల్లినాడు. "అగతియమ్" అను ద్రావిడ వ్యాకరణ మీమహర్షిచే రచింపబడినదట. ఒక శిల్పగ్రంథముగూడ నాయనపేర బరగుచున్నది. అగస్త్య మహర్షి పేర ద్రావిడ దేశమంతటను ననేకదేవాలయము లున్నవి. అదియును గాక, యామహర్షి చిరజీవియై చర్మచక్షురగోచరుడై నిత్యముగా "పడగై" పర్వతముమీద నివసించుచున్నాడనువిశ్వాస మున్నది. ఈ పర్వతము తిరునల్వేలి జిల్లాలో నున్నది. ఆ మహానుభావుడిప్పుడును "పోతేయా" కొండలలో సంచరించుచుండునను జన విశ్వాసమును బట్టియే, యాయన దక్షిణ దేశములందు జ్ఞాన ప్రచారము కొఱకెంతగా పాటుపడి యుండినదియు నూహింప వచ్చును. దక్షిణ భారత విజ్ఞానము నంతను నార్యసాంప్రదాయ సిద్ధముగ సంస్కరింప గలుగుటచే కొలది కాలములో నగస్త్యమహర్షి ఈశ్వర ప్రాయుడుగ పూజింపబడసాగెను. అగస్త్యపూజా విధానము స్కాందాగ్ని పురాణములయందు నిర్ణయింప బడినది. అగస్త్యేశ్వర దేవాలయములలో, నుత్తరార్కాటు జిల్లాలోని "నారాయణవనము" నందును "వేదరాయణు" నందును నిర్మింపబడినవి చాల ప్రసిద్ధికెక్కినవి.

వేదరాయణు దేవాలయము నందలి యగస్త్య విగ్రహము లొకటి రాతితోడను మఱియొకటి లోహముతోడను నిర్మింపబడినవి. ఈ విగ్రహములను, చిదంబర దేవాలయము యొక్క తూర్పు గోపురమునందున్న విగ్రహముతో బోల్చి చూచినచో వాటినిర్మాణ వైచిత్ర్యము విస్పష్టము గాగలదు.

ఇంక నీమహర్షి యొక్క జీవితమునుగూర్చి యించుక చెప్పెదము. కొన్ని శాసనదృష్టాంతముల వలన నీ మహానుభావుడు కాంబోడియా ద్వీపమునకు జని, యచ్చట నొక రాజకుమారిని బెండ్లియాడి యొక రాజ వంశకర్త యయ్యెనని తెలియుచున్నది. దక్షిణ దేశములో దొరకిన యొక విగ్రహముపై జెక్కబడిన శాసనమునకును, కాంబోడియా లోనను, సయాము నందును దొరకిన శాసనములకును భేదమావంతయు గాన నచ్చుటలేదు.

ఈ మహర్షిసత్తముడు మలయద్వీపమునందు నివసించెనని వాయుపురాణములోని కొన్ని శ్లోకములబట్టి తెలియుచున్నది. సుమత్రాద్వీపమునం దిప్పటికిని నొక పర్వతము "మలయా" నామమున బరగుచున్నది. పురాణములం దగస్త్యమహర్షి చరించినటుల వ్రాయబడిన పర్వత మిదియే కావచ్చును. వీటియన్నిటికంటెను ప్రబలమైన సాక్ష్యము మఱియొకటి యున్నది. జావాద్వీపమునందు దొరకిన రెండు శాసనములం దా ద్వీపమునందు "కుంజరకోన" యనుచోట కట్టబడిన యొక దేవాలయ మగస్త్యుడు పూర్వము దక్షిణదేశమునం దుండిన చోట నిర్మితమైన యొక దేవాలయపు మాదిరిని నిర్మింపబడెననియు, దక్షిణదేశమునుండి "యగస్త్యగోత్రికులు" కొందరు జావాద్వీపమునకు వలస బోయిరనియు స్పష్టముగా వ్రాయబడియున్నది. ఇంకొక శాసనమునుబట్టి యగస్త్యుడు స్వయముగా జావాద్వీపమునం దొక దేవాలయమును నిర్మించెనని యున్నది. ఆర్కిపెలగోద్వీపములయందు దొరకిన యీ శాసనముల బట్టి, యగస్త్యమహర్షి సుందద్వీపమునకును, కాంబోడియాలంకకును బోయి యుండినమాట యథార్థము గనే కన్పట్టుచున్నది. పోనీ యీ ద్వీపముల కగస్త్యుడు స్వయముగా వెళ్ళియుండక పోయినను నాతని మతసంప్రదాయములయిన నచ్చటికి బోయి యుండవచ్చుననుట సత్యము. క్రీస్తుశకము 7 శతాబ్దమునకు వెనుక జావాద్వీపమునం దగస్త్యమహర్షి యొక్క దైవముగా బూజింపబడెడువాడు. ఈ విగ్రహములు తొలుత మంచిగంధపు చెక్కతో చేయబడుచు తరువాత రాతితో నిర్మింపబడుచుండెను.

జావాలో దొరికిన విగ్రహములను దక్షిణదేశమునందు గన్పడిన విగ్రహములతో బోల్చి చూచినచో జావాద్వీపమునందు "భారతగురు" వను పేరుతో వ్యవహృతములగుచున్న విగ్రహము లగస్త్యమహర్షివే యని విస్పష్టము కాగలదు. ఇదివరకు డచ్చిశిల్పశాస్త్రవేత్తలు పొరపాటుబడి యా విగ్రహములకు త్రిశూలాది చిహ్నము లుండుటచే నవి యార్కిపెలగో ద్వీపములందు బూజింపబడు నొకమాదిరి శివ విగ్రహములని తలంచిరి. సర్ స్టాంఫర్డు రాఫిల్సుగారు వ్రాసిన దానినిబట్టి చూడ జావాద్వీపమునందు శివవిగ్రహముల కెన్నడును లావైన నడుమును చెక్కరు. అగస్త్య విగ్రహమునకుఁ బలె యోగులకును మునులకును మాత్రమే పెద్దనడుము లున్నటుల చెక్కుదురు.

ఈ మహర్షి యొక్క మతసాంప్రదాయాను సారముగనే ఇండో-జావనీయుల నాగరికత వర్ధిల్లినది. జావాద్వీపమునందు "సాగ" యను పేరుతో మహాభారతము రచింపబడెననియు కళింగ దేశమునుండి కొందరు రాజుల నాద్వీపము నేలుటకై యగస్త్యమహర్షి పంపెననియు జావాలోని కొన్ని పురాతన కథల వలన తెలియుచున్నది. బలినీయుల సిద్ధాంత ప్రకార మగస్త్యుడు బ్రహ్మవిష్ణు మహేశ్వరుల కంటెను పరమపూజనీయుడు. ఈమహర్షి సుందద్వీపములలో "శివగురు" నామమున బూజింప బడెడివాడు. జావా, బలిద్వీపముల కగస్త్యుడే పరమ దైవతము.

ఇండో జావనీయుల దైవతములయం దగస్త్యుడు ప్రధాన స్థానము వహించుటచేత, నా మహర్షి శ్రేష్ఠు డొక్క యార్యవిజ్ఞాన ప్రచారకుడే గాక, బ్రహ్మణ్యుడైన శిల్పాచార్యుడును, సముద్రముల దాటి యెచ్చటనో భారత విజ్ఞానము నెలకొల్పిన నూతన భారతదేశ నిర్మాతయు నని నిశ్చయింపవచ్చును.

— అహల్యా శాపవిమోచనము —

కం॥ చని గౌతమముని యీగతి యనుఁగుం గొడుకయిన యా శతానందునకున్
వినుచును జరిగినసంగతి వినయావనతుఁడయి యతఁడు వే యిట్లనియెన్.

తే॥ "తండ్రి! యంతయు సరియె, నాతల్లి కేల శాపమోచన మబ్భంగి సలుపవైతి?
నా పెలే పెడిపనికూడ నరసిచూడ నలవి కానిది కాదునీ కట్లు గాన. ౬౧౨

కం॥ దీనుఁడ నుత్కంఠితుఁడను నా శాప మదంబతో సమాగమ మగున
ట్లో నాయన! కరుణించుము నానతియి మ్మొకె శుద్ధయగు పాచితమున్. ౬౧౩

కం॥ అనియిట్లు వేడుకొనుటయు మునియిట్లను. మద్యభాండమును శుద్ధముఁజే
యను సాధ్యమైన నగు విటజనశేతస్సి క్తభగకు సంశుద్ధియిడన్. ౬౧౪

కం॥ కలుద్రావినబ్రాహ్మణుఁడును నిల మౌంజీహోమమునను నెనయు విశుద్ధిన్
బలు తింగిని సాధించియుఁ గులటాంగన శుద్ధ గాదు కొంచెముగూడన్. ౬౧౫

కం॥ తలఁచుగను సురాభాండము పరిశుద్ధిని గాంచు వహ్నిఁ బతితంబై. య
క్క్రరణిఁ బరపురుష శేతఃపరిపూరితభగయు నగ్నిఁబడి శుద్ధయగున్. ౬౧౬

కం॥ ఈ కారణమునఁజేసియె యోకొడుకా యమ్మదంబ కొసఁగితి శాపం
బేకృచ్ఛమ్ములకలనను నాకె విశుద్ధాత్మగా దిఁ"కని నొడువుటయున్. ౬౧౭

ఆ॥ అట్టులైన నగ్నియందైన దూఁకుదుఁ, బడుదుఁ బోయి పెద్ద బావినేని,
గరళ మేనితిందుఁ. గాని మాతృవియోగమును సహింపఁజాల జనక! నేను. ౬౧౮

మ॥ మనుహారీతపురోగమర్షి కృత ధర్మగ్రంథము ల్లేవె? యిం
కను నైతిహ్యపురాణము ల్గలవు వీఁకన్ వాని శోధించి నా
యన! మాయమ్మకుఁ జెప్పు మేదొ యొకప్రాయశ్చిత్త. మద్దానిచే
తను శుద్ధంబొనరింతుఁ, గాదనిన సంత్యక్తంబులౌఁ బ్రాణముల్." ౬౧౯

తే॥ అని శతానందుఁ డనుటయు విని మహర్షి పెద్దయుంబ్రొద్దు ధ్యానించి ప్రేమ నతనిఁ
గౌఁగిటను గ్రుచ్చి బాహుయుగ్మమున మఱియు నెలమి మూర్కొని తచ్చిరం
[బిట్టులనియె. ౬౨౦

ఆ॥ "తనయ! యాత్మహత్య యొనరించికొని యిట్లు కలుష మేల మూటగట్టుకొనెద
వింతసాహసంబు నేల కావించెద? వాలకింపుమయ్య యస్మదుక్తి. ౬౨౧

కం॥ పుత్రా! నీజనయిత్రి పవిత్రయగుచు మామకీన వేశ్మములోనన్
రాత్రిందివములు మనుఁ. జిన్నేత్రమునం గంటి దీని నేను నిజముగన్. ౬౨౨

ఉ॥ రావణుసంహరించుటకు రాముఁడు నాఁగ నరాకృతిన్ ధరన్
శ్రీవిభుఁ డర్కవంశమునఁ జెల్వుగఁ బుట్టుఁ దదంఘ్రిసోఁకునన్
బావనయౌచు నీప్రసువు మానవరూపముదాల్చుఁ గ్రమ్మఱన్.
గావున నంతదాఁక తమగల్గి నిరీక్షణసేయు మాత్మజా!" ౬౨౩

క॥ అనవిని మంచిదియని యమ్మునినాథుఁడు జనని శాపమోచనకాల
మ్మున కెదురుచూచుచుండెను. దనర్చుల కుండదె యపేక్ష తల్లులమీఁదన్. ౬౨౪

తే॥ అంత బహుకాలమునకు జనార్దనుండు పంక్తికంఠవధార్థమై పంక్తిరథుని
యింట రామావతారంబు నెత్తియుండ బాల్యమందున యాభగవాను నేను.

చం॥ క్రతువును సాఁగనీక బహుకష్టము పెట్టెడి దుష్టరాక్షస
ప్రతతిని రూపుమాపుటకు బల్మిని దోడ్కొనిరాఁగ నేడ్తెఱన్
హిత మొనరించె వారల. మదధ్వరముం బరిపూర్ణమయ్యె నో
క్షితిపతి వీనులంబడియె సీత స్వయంవరమాట యయ్యెడన్. ౬౨౫

ఉ॥ ఏలిక లంద అందరుగ నేనును దద్రవిళంశభూమిభృ
ద్బాలకుఁడైన పంక్తిరథుపట్టినిఁ దోడ్కొనిపోతిఁ. బోవఁ బో
నోలిని గౌతమాశ్రమమునొద్ద విశాలశిలాస్వరూపయై
నేలఁ బరుండియున్న సువినీత యహల్య గనుంగొనంబడెన్. ౬౨౬

చం॥ పదపడి రాముఁగన్గొని "కృపామతి నియ్యుపలంబుమీఁద నీ
పదవనజంబు మోపుమయ పంచజనత్వమునొందు. గౌతమ
ర్షి దయితయీపె. యల్కఁబతిచేత శపింపఁగఁ బడ్డదై యిటన్
బెద శిలయైన" దంచు నిటు నేను వచించినవాఁడ భూధవా! ౬౨౭

ఆ॥ అటు మదుక్తమగుడు నవికల్పముగ నతం డతికుతూహలమున నట్లుచేయ
నపుడెయద్ది మానవాకృతిధరియించి దివ్యరూపయగుచుఁ దేజరిల్లె. ౬౨౯

క॥ అంతం దా మునుసలిపిన మంతువు స్వాంతంబునందు స్మరణమునకు రా
నెంతయు బిడియంపడు చకాంత జోహారులొనర్చి గౌతమమునికిన్. ౬౩౦

క॥ "పరపురుషునితో సురతము జరిపినగరితకు విరించి సముచితమని యే
ర్పఱచిన ప్రాయశ్చిత్తము సరవినివచియింపవయ్య స్వామీ! నాకున్. ౬౩౧

క॥ నేనది దుష్కరమైనను బూని యొనర్చికొని శుద్ధిఁబొందెద"నన న
మ్మౌనియుఁ బెద్దయుఁబ్రొద్దిద ధ్యానించి తదబ్జముఖికిఁ దా నిట్లనియెన్. ౬౩౨

తే॥ అఱువదెనిమిదితీర్థంబులందుఁగ్రుంకు చాచరింపుము నూఱు చాంద్రాయణములు
వేయికృచ్ఛ్రంబులును. వాన వీన నుండి యీవు సంశుద్ధవయ్యెద విందువదన!"

మ॥ అని యిబ్భంగి వచింప నాపె "యటులే" యంచుం బ్రతిజ్ఞన్ వహిం
చినదై తత్స్థలవర్తిలింగముల నన్నింటిన్ సమర్చించు చా
య్యన వారాణసియాదిగాఁగలుగు నా యష్టోత్తరంబైన వ
ష్ట్యనఘక్షేత్రములం జరించెఁ బృథివీశా! యెంతయున్ భక్తితోన్. ౬౩౪

ఆ॥ ఆవిధంబుఁ జరియించు చవ్వధూటి హాటకేశ్వరమున కేగి యట్టికనుడు
నాగరుం డొక్కరుఁడు వచ్చి నాగలోకపుం బథంబగు నాగబిలంబు జూపె.
తే॥ తత్పథంబున నేగి పాతాళమునకు నఖిలదేవాదిదేవుఁ డాహాటకేశు
పూజ సేయుచునుండిరి పూర్వమందుఁ దీర్థయాత్రికులౌ మును ల్పార్థివేంద్ర! ౬౩౬

ఉత్సాహము॥ అంత "దేవదేవుఁడైన హాటకేశు దర్శనం
బింతదవ్వు వచ్చికూడ నేను జేయకున్న చో
సుంతయేని యాత్రవలని సుఫలముండ. దందుచే
నెంతయుం దపంబొనర్తు నీతదర్థ మిచ్చటన్." ౬౩౭

తే॥ అనివిచారించి కర ముగ్రమగు తపంబు సలుపుచును శివలింగసంస్థాపనంబు
చేసి ముప్పూఁటలును సమర్చించుకొనుచు గౌతమునిగోల యటఁ జాల కాలముండె.
ఆ॥ మంచియెండవేళఁ బంచాగ్నిమధ్యమం దారుబయట వాన కాలలోనఁ
గొంతుబంటినీటఁ గ్రుంకి హేమంతమం దాయహల్య తపము నాచరించె. ౬౩౯
కం॥ అంతంత శ్రమలకోరిచి యింత తపించినను హాటకేశ్వరలింగం
బింత కనఁబడదు ధాత్రీకాంతా! యంతటను గొంతకాలంబునకున్. ౬౪౦
కం॥ మరులెత్తఁ దల్లిమీఁదం దరలి శతానందనాని తత్త త్తీర్థో
త్తరముల నన్వేషించుచు నరిగెను శ్రీహాటకేశ్వరాహ్వయమునకున్. ౬౪౧
ఆ॥ అరిగి ఘోరతపము చరియించుజనయిత్రిఁ గాంచి మానసంబు కరఁగి నీర
మగుడుఁ గరయుగంబు మొగిచి దైన్యంబుతో బిట్టుదుఃఖపడుచు నిట్టులనియె.
ఆ॥ "ఇచటఁ జేరి కాయ మేటికి శుష్కింపఁ జేసె దుగ్రతపముఁ జేసికొనుచుఁ
దిరిగి తెలుపదేని తీర్థంబు. లటనుండు శంభులింగములను జక్కఁగంటి. ౬౪౩
తే॥ ఈరసాతలగత హాటకేశలింగ మెసరుండును వీక్షించియెఱుఁగఁ డవని.
నొకటి దర్శింపఁబడకున్న నుండుఁ గాక. నాదుతండ్రియె నీకిచ్చినాఁడు శుద్ధి.
తే॥ అట్లుగావున నేగుద మరుగు దెమ్ము జననునాశ్రమమునకు నోజనని యింక.
దారులం జూచుచున్నాఁ డతండు నీదురాకకై కర్షకుండు వర్షముఁబోలె."
ఆ॥ అనుడు "నెంతవఱకు హాటకేశ్వరదేవ దర్శనంబు నాకుఁ దనయ! కాదొ
యంతవఱకుఁ గూడ నరుదేర నాదేవుదరిసెనంబొనర్చి యరుగుదెంతు" ౬౪౬
కం॥ అనుడు శతానందుం "డోజననీ! యిది గట్టియైన జనకుసకాళం
బున కేనును నీతోడన చనియెద"నని శంభులింగసంస్థాపకుఁడై ౬౪౭
శా॥ ముప్పూఁట ల్భస్మచందనాదికములం బూజించు చాలింగమున్
బప్పుం బువ్వయుఁ బాలు నెయ్యి పెరుగు న్నైవేద్యము ల్పెట్టుకొం

ముప్పొంగారము లేని యీగిరము సూర్యుం డేగుపైఁ దానుదిం
చిప్పాటం దపముండె నాతఁడును నెంతేఁగాల మోయోలికా! ౬౪౮

శా॥ వేదోక్తంబగుసూక్తము ల్చదువు చద్విప్రోత్తముం డెంతయో
యాదేవున్ భజియించెఁ గాని యెటులున్ హర్షంపడం డాతఁడా
మీఁదన్ గౌతముఁ డెంతో కాలమునకుం బ్రేమాస్పదుండౌ సురున్
దా దర్శింపఁగఁ బోయి యందు నిజమాతంగూడి యుగ్రంబుగన్ ౬౪౯

కం॥ తపమున్న కొడుకుఁగని మొద లపరిమితంబైన హర్షమందియు మగుడన్
నృప మానవసహాజంబగు నపథమునఁ బ్రవిష్టుఁడగుచు నాత్మగతమునన్ ౬౫౦

ఉ॥ "కష్టముకష్ట మౌర! యధికంబు తపంబు చరించుకొంచు నై
పుష్టినిబాసె నాదు వరపుత్రుఁ. డెట్లు గానిపోదు నింటికిన్ ?
నష్టనిజానవాభయగు నాసహధర్మిణి దర్భకట్టినాఁ
జేష్టలుదక్కియున్న యది చేఁగఁదగ్గదియొద్ది నాకిఁకన్ ? ౬౫౧

మ॥ అని చింతించి "తపంబు చాలు నిఁక లెండా. యింటికిం బోద" మం
చని వాక్రుచ్చెడుఁ దత్తనూభవుఁడు "తాతా! యీపనిన్ మాన్పఁగన్
జననింగూర్చి యనేకధా నుడివితిం. దద్ధాటకేశుం గనం
గొనకే రాదఁట. యామెవచ్చుటయు కేవన్ రాను నా యింటికిన్." ౬౫౨

ఉ॥ ఈయది నాదునిర్ణయ. మింకేయది యుక్తమటం చుఁదోఁచునీ
కాయది యాచరింపుము మహామహ!" నావుడు గౌతముం డను "తం
డ్రీ! యిది నీదునిశ్చయమయేనియుఁ జూపెద హాటకేశ్వరున్
నీయమరుం దపోమహిమ నే" నని చెప్పి యనంతరంబునన్ ౬౫౩

సీ॥ ఆఱవకాలమం దారగించుటకుఁగా వ్రతమూని మును నూఱువత్సరములు.
ఒకనాఁడుమాని వేఱొకనాఁడు భుజువంగ సాహసించెను నూఱుసమలు పిదప.
మూన్నాళ్ళకొకసారి భుజియింపదొరకొని సంత నింకొక నూఱుహాయనములు.
ఫలభక్షణముతోన నిలిపె శరీరంబు నటుపైని మఱియొక్కయబ్దశతము.
నీళ్ళుద్రాఁగియుండె నిష్ఠమై నూఱేండ్లు. గాలితినియె నుదక గడపెఁ గాల.
మవ్విధమున వేయియబ్దము ల్తపముండె గౌతమర్షి గూడఁ గాళ్యపీశ! ౬౫౪

చం॥ అపుడు భవింబ గుల్చుకొని యర్కసమద్యుతి సర్వలక్షణం
బు పయికివచ్చె లింగ మదెమూర్తమునన్ భగవానుఁడైన ఖం
డపరశువుం దదీయనయనంబులకుం దగ గోచరించి స
త్కృపమెయి డాయఁబోయి తనకేలునఁ గేలు గ్రహించి యిట్లనున్- ౬౫౫

ఉ॥ "గౌతమ! నీవ్రతంబునను గల్గెఁ బ్రమోదము- హాటకేశ్వర
ఖ్యాతము మామకీనమును నై మను నేత దనాదిలింగము

ద్యోతిత నాగలోకముననుండి మహీస్థలి కేగుదెంచె నీ
చేతఁ జరింపఁగాఁబడెడి శ్రేష్ఠతపంబు కతంబున న్మునీ! ౬౫౬
చం॥ ఎదియుదిఁగోరి నీవు సుతుఁ డింతి తపంబు చరించుచుంటిరో
యది లభియించె- నీదుసతి యుర్వదియొన్మిది క్షేత్రరాజముల్
వదలక సంచరించుటను వచ్చినయట్టిఫలంబు గాంచుఁగా-
కిదియునుగాక వేఱయొక డీవును గోరు వరం- బొసంగెదన్-" ౬౫౭
చం॥ అనియిటుపల్క గౌతమమహాముని "దేవ! రసాతలంబునన్
మను నెడ హాటకేశు నొకమాఱు గనుంగొనఁ గల్గుపుణ్యమే
జనముల కీస్థలంబునను జక్కఁగఁ గన్గొనఁ గల్గఁజేయు- మిం
కను గర మెక్కుడై యొలయఁగావలయున్ ఫల మేతదర్చనన్- ౬౫౮
తే॥ చైత్రశుద్ధచతుర్దశి సరిగవచ్చి యెక్కుడగుభక్తి నీ హాటకేశలింగ
మునకుఁ బూజనమొనరించు మనుజులెల్ల రరుగవలయును ద్రిదశాలయమున కెలమి-
తే॥ నాదుసతిచేత సుతుచేత నవ్యముగఁ బ్రతిష్ఠితములగు లింగము ల్భక్తితోడ
నదెదినంబునఁ బూజించునట్టిప్రజయుఁ గలుషములనుండి తొలఁగంగవలయు గిరిశ!"
క॥ అని కోరఁగాను డు "నగుఁగాకని యాఖండేందుమౌళి యంతర్ధానం
బును జెందె- నాఁటఁగోలెను జనులకుఁ దద్దర్శనమున సమసె నఘంబుల్- ౬౬౧
క॥ నరులు శతానందేశ్వరు మఱియు నహాల్యేశ్వరుం గ్రమంబుగఁ బూజిం
చి రహిం ద్రిదివాలయమున కరిగిరి పరసతులఁగూడినట్టిరు గూడన్- ౬౬౨
తే॥ అంతలో స్వర్గమంతయు వ్యాప్తమయ్యెఁ గలుషతరమగు మానవగణముచేత-
నిఁకను నీవెంతయనిన నీవెంతయనుచు సరకు సేయకయుండి రాసురల నరులు-
సీ॥ క్రతుకర్మమొనరింపఁ గడఁగనే యొకఁడేని తల్లింగదర్శనతత్పరతను-
సువ్రతంబొనరింపఁ జూచెనే యొకఁడేని లింగత్రయిం గౌఁగలించుకొనుచు-
దానంబుసలుపంగఁ దలఁచెనే యొకఁడేని యాలింగములమూటి యర్చవిడిచి-
తీర్థసేవయొనర్పఁ దిరిగెనే యొకఁడేని యాహాటకేశంబు నవలకరిగి-
యట్లు లింగదర్శనాదికంబులచేత స్వర్గమాక్రమించి జనచయంబు
స్పర్ధసేయ సురలు భయపడి వ్యథతోడ నింద్రునొద్దకేగి యిట్టులనిరి- ౬౬౪
శా॥ "భూలోకంబున సర్వధర్మములునుం బోకాడెఁ బాకారి! దు
శ్శీలంబయ్యెను వచ్చి యిప్పటికి సుశ్రీయందు మాతోడనే
పోలంజూచెడిఁ బూరుషాళి సతతంబున్ గర్వసంయుక్తమై-
క్రాలుం జాలఁగ హాటకేశ్వరమునాఁగన్ క్షేత్ర మొక్కం డటన్- ౬౬౫
ఉ॥ అందల గౌతమర్షియుఁ దదంగనయైన యహల్యయున్ శతా
నందుఁడునాఁగఁబిల్వఁబడు నందనుఁడుం దపముండి పెద్దప్రా

ద్దందఱు నన్నిలింగముల హాయిన స్థాపనచేసినారు- త
త్సుందరలింగపూజనము చూ కత మిందులకుం బురందరా! ౬౬౬

క౦॥ గౌతముఁ డీతీరునఁ దనుఁ బ్రీతుంగావింపఁ దపము వెల్లిన మఱియున్
బాతాళంబుననుండియు నేతెంచినవాఁడు హాటకేశ్వరుఁ డటుకున్ ౬౬౭

మత్తకోకిల॥ తత్ప్రభావముచేత నేర్పడె ధాత్రి నీవ్యవహార. మీ
పత్ప్రయోజనమేనిలేదిఁక శ్రాద్ధదేవున కారయన్-
దత్ప్రసిద్ధములైన నాగకతండ ముత్తదియయ్యె- నే
తత్ప్రకార మెఱింగి చేయుము దానినాఁగడి చైదమున్- ౬౬౮

ఆ॥ యజ్ఞవిధులు మగుడ నవనీతలంబున సాఁగవలయు దేవతాగణేశ !
వానివలనితృప్తి వేసనుం గలుగదు మనకు నెంతమాత్ర”మనుడు నతఁడు ౬౬౯

క౦॥ తామా ద్యంతశ్శత్రుస్తోమంబును బిలిచి “ మీరు తొందరగం ద
ద్భూమిపయికి దిగి యందఱు సాహస్ర్యముకోలఁది నేనుశాసించువిధిన్- ౬౭౦

ఆ॥ గౌతమేశ్వరునకు ఘన శతానందేశ్వరునకు నట్లె మఱియు ననఘుఁడౌచు
నచటనుండియున్న యాయ్యావాశ్యేశ్వరునకును నిఁకను బూజనంబు లెలమి ౬౭౧

చ౦॥ జరుపుకయుండ మానవుల స్వాంతములన్ మరలింపుఁ”డన్న నా
హరిహాయుశాసనంబు తలయందునఁదాలిచి వారు గౌతమే
శ్వరముఖదేవతాత్రితయభక్తమనంబులఁ జొచ్చి యాజనుల్
జరిపెడిపూజ లాఁగి, రరిపట్కముపూనిన గానిదేది”నాన్ ౬౭౨

—§ సిద్ధసేనుఁడు రాజ్యభ్రష్టుఁడై చింతించుట. §—

ఉత్సాహము॥ “ ఏమి తేత్ర మేమి తేత్ర మెన్న హాటకేశ్వరం
బోమునీంద్ర! తృప్తిగా దహోయహో! వినన్ వినన్-
నామనోరథంబుదీర నష్టకల్మషుఁడను గాఁ
బ్రేమ శంఖతీర్థమహిమ విస్తరించిచెపుమిఁకన్” ౬౭౩

క౦॥ అనియాన ర్తనృపాలుఁడు వినయంబున నడుగుటయును విశ్వామిత్రుం
డను. “వినుము శంఖతీర్థమ్మునకుం గతమగు మఱొక్క మునుపటిగాథన్. ౬౭౪

శా॥ ఆనర్తంబున కీవు ప్రస్తుతమునం దైనట్లె యన్యుండు మున్
దా నాథుండయి కొంతకాల మవనిం బాలించి యామీఁద నెం
తో నింద్యంబగు కుష్ఠరోగముననే రోగాలిం గృశించెన్ ధరా
జానీ! యాతఁడు-పెక్కు-లేల-పలుకష్టంబుల్పడెంబో తుదన్. ౬౭౫

సీ॥ తనుఁజూచి భూజను ల్దవుదవ్వులం బోవఁ బెద్దవ్యాధికిఁ బీటఁబెట్టినాఁడు,
కాలుసేతులు కార్యకారులు కానట్టు లూడిపోయినవ్రేళ్ళ నుండినాఁడు,
పడిచిచో వడి లేవఁబట్టుటకై నను గొడుకులు లేకుండఁ గుందినాఁడు
పరరాజులరుదెంచి పురమాక్రమింపంగ హాయంచు గడగడలాడినాఁడు,
రణముసేయలేక రాజ్యంబు గోల్పోయి పాతి రైవతాద్రి దూఱినాఁడు,
అచటఁగూడ ననుదినాగతప్రతిరోధిబాధ్యమానుఁడగుచుఁ బనవినాఁడు, ౬౭౬
చం॥ అతఁడపు డాంధ్రఁగూడ నటు నాటవిక ప్లారియించుచున్కికిన్
మతి నెది కార్యమంచుఁ బలుమాఱులు చింతిలి నారదుండు స్వ
స్మృతిస్మృతిగోచరింప మెలమెల్లగఁ దా హరివాసరంబునం
దతనిగుఱించియేగ, నపు డమ్మనివర్యుఁడు తీర్థయాత్రలన్ ౬౭౭
ఉ॥ చేయుచు విష్ణుమందిరము చెంతకు రాఁ దిలకించి యాతనిన్
డాయఁగఁబోయి మెల్ల నచటం గడుదీనతఁ గూరుచుండి కై
దోయి మొగిడ్చి యిట్టులను "దుర్గ్రహదీనకతిరస్కృతుండనై
యీయచలంబుఁజేరితి, నిఁకేమని చెప్పుదు సంయమీశ్వరా! ౬౭౮
సీ॥ అస్మదీయములైన హాస్త్యశ్వరథములే యిపు డాటవికులు తా మెక్కితిరుగ,
టస్మదీయహిరణ్మయామూల్యభూషలే చెంచుతలిపుడు కైసేసికొనుట,
యస్మదార్జితమైన యర్థంబె పరిస్తుతం బనుభూయమాన మంత్రాళిచేత,
నస్మదుద్వాహితస్త్రీలె యీనాఁడు దాసీలు తురకల తలియబోండ్ల,
కరినృపాలురు రాజ్యంబు నాక్రమించు చపహరింపంగమిగిలిన యాయొకింత
వైభవము గూడ జడవారివలతి కోఁడ కైవసంబయ్యె వల్లడి కాంధ్ర కిటుల. ౬౭౯
ఉ॥ ఇట్టివిపత్పరంపరల కే గుఱియౌటకుఁ బూర్వజన్మమం
దెట్టియఘంబు సేసితినో యీవు వచింపు మహానుభావ!" నా
నట్టినిమీలితాక్షుఁడయి ధ్యానమొనర్చి చిరంబు దివ్యమై
నట్టికనుంగవన్ సకల మాత్మ నెఱంగి మునీంద్రుఁ డిట్లనున్. ౬౮౦
సీ॥ సకలశాస్త్రంబులుం జదివినాఁడవుగాని కావేదియెఱుఁగని కాఁబుదున్న,
వధ్వరంబులు పెక్కు లాచరించితి గాని సంఘసంస్కరణ ముల్సలుపఁగఁడఁగ-
వనయంబు దానంబు లొనరించితివి కాని బెదరించిపంపవు బిచ్చగాండ్రఁ-
బుడమివేల్పుల భక్తిఁ బూజించితివి కాని దూఱియుండవె వేవో కాలులఁబడి-
యట్లు సిద్ధపన్న గాహ్వయపురమునం జంద్రవంశ్యరాజచంద్రుఁడవయి
యించుకంతపాపమేన్ జేసియెఱుఁగవు పూర్వభవమునందు భూప! నీవు" ౬౮౧

చం॥ అనవుడుభూమిపాలుఁ "డటులైనను నీజననంబునందు నా
యొనరిచియున్న యట్టియఘ మొక్కటియుం గనుపట్ట-దేలయి
ట్లొనరెనురాజ్యవిప్లవ మహా ముని! యిప్పుడెటుంగనయ్యెఁబో
ధనరహితుండు లోకమునఁ దా మను టెంతయు వ్యర్థమం చెదన్. ౬౮౨

సీ॥ ధనహీనుఁడై నయాతండు జీవించియు మృతుఁడపో-యవ్వాని నెవ్వఁడడుగు ?
రాజునుగోల్పోవు రాష్ట్రి మున్న దియయ్యు లేనిదే-యొవఁడొందు దాన సుఖము ?
వశ్రోత్రియునకిచ్చునది యీయనియదయా-నెవనిచే నయ్యది యెన్నఁబడును ?
దక్షిణాహీనమై ధరనైనయుజ్ఞంబు కానిదే-యట వేనికాను దృప్తి ?
ధనవిహీనునిచుట్టంబ త న్నెదేని యడుగునను భీతిఁ బెట్టును బెడ మొగంబు
వెనుక నాచేత సంతృప్తి పెట్టఁబడియుఁ గాంచినన్నిప్ప దద్వేగు ఘనులభంగి- ౬౮౩

తే॥ ఉత్తమాన్వయసంభూతు యోగ్యుఁడైన విత్తహీనుని స్వజనంబు విడిచిపోవు-
సుందర రసాలమైనను శుష్కవృక్షమును బులుంగులు విడనాడి చనువిధమున- ౬౮౪

కం॥ తనకార్యంబునుగూరిచి ధనహీనుఁడు ధనికునిల్లు తాఁ జొచ్చెడిచోఁ
గని చీదఱపడుఁగానీ మనసిచ్చి రవంతయేని మాటాడఁడహో! ౬౮౫

కం॥ ఎంచఁదగులోభియైనను సంచితధనుఁడయ్యె నేని చని వానినె యా
చించుచునుందురుమనుజులు కొంచెమొ గొప్పయొ యొసంగఁ గొనునూహామెయిన్-

శా॥ "నాకుం దోల్లిటిచుట్టమీవు-వెనుకన్ నాతండ్రి నీతండ్రి య
స్తోకస్నేహముగల్గివర్తిలిరి-యిచ్చో నేలొకో నాపయిన్
నీకేలేదది" యంచు విత్తయుతుసాన్నిధ్యంబునంజేరి యే
మో కోలాహల మాచరింత్రు ద్విజులయ్యున్ లోకు లర్థాశతోన్- ౬౮౬

కం॥ దారిద్ర్యసహితుఁడెవ్వఁడు తా రాజ్యం బెవఁడు సేయుఁ దన్మనుజుల హృ
న్నీరజములకుఁ బ్రకోపం బారూఢిగ నగుచునుండు నమరమునీంద్రా! ౬౮౭

ఆ॥ అధనుఁడయ్యు నెవ్వఁ డడియాసపడుచుండు నెవఁడు కుపితుఁడగు నసీకుఁడయ్యు
నా విచారశూన్యులగువార లిరువురే కాయశోషఁ జేయు కఱకుముండ్లు. ౬౮౮

కం॥ ధనలుబ్ధు లర్థరాత్రము కనుకని సేవింత్రు వల్లకాడును గూడన్-
జననయితనువదలిరేనియు ననయము బహుదూరమునకు నరుగుదు రకటా! ౬౯౦

చం॥ ధనికుఁడు మూర్ఖుఁడయ్యు నగు దండిమనీషి-మనీషియయ్యు ని
ర్ధనపురుషుండు మూర్ఖుఁడగుఁ-ద ద్ధనవంతుకులంబు నీచమ
య్యును ఘనమౌఁ-గులీనుఁడయియుం గులహీనుఁడగున్ దరిద్రుఁ-డీ
ధనముప్రభావ మేమనుదు-దాసులఁజేసెడి నెంతవారలన్. ౬౯౧

౮ బేలూరి రామన్న గుప్తగారు, సదాశివుని పేట

౯ రాయచూరి బండేరావుగారు, అయినాపురం.

౧౦ రాచూరి సుబ్బయ్యగారు - శ్రీ శ్రీ విరూపాక్షసంస్థాన ప్రధానమంత్రి

౧౧ ఘంటంభట్లగారి వెంకటభుజంగముగారు - ముసలాపురం

౧౨ దండు గుండేరావుగారు, కరణము - ముసలాపురం

౧౩ తిగుళ్ళ కృష్ణారెడ్డిగారు. పటేలు - ముసలాపురం

౧౪ కాకుమాను హనుమయ్యగారు, నర్సారావుపేట

౧౫ తిప్పరాజు కామేశ్వరరావుగారు, కరణం, దుగ్గిరాల

౧౬ భాస్కరరాయని వెంకట రామయ్యగారు, వంగపల్లి

౧౭ నరసింహాస్వామివారు, యాదగిరి

౧౮ బీరకాయల హనుమంతరావుగారు, రాయగిరి

౧౯ జాలూరి వెంకటరత్నముగారు, వకీలు, గుంటూరు

౨౦ మెదక్ కిషన్ రావు దేశముఖుగారు, నల్లపల్లి

౨౧ జానపాటి సుబ్రహ్మణ్యంగారు, ప్లీడరుగుమాస్తా, గురిజాల.

౨౨ లింగాల సీతారామరెడ్డి బండారెడ్డి దేశముఖుగార్లు-నారాయణపురం

౨౩ కవులూరి నరసింహారావుగారు, తాలూకా గుమాస్తా-నర్సారావుపేట

౨౪ గోపేటి వేణుగోపాలరావుగారు, పోలీసుసబిన్స్పెక్టరు, ప్రత్తిపాడు

౨౫ రాచకొండ వెంకటరామయ్యగారు, యెనమదల

౨౬ కప్పగంతు సుబ్బారావుగారు - పోలీసుసబిన్స్పెక్టరు - బెల్లంకొండ

౨౭ మండ చినవెంకయ్యగారు, దండమూడి.

౨౮ శ్యామాపంతుల గోపాలరావుగారు - హైదరాబాద్.

౨౯ కన్నయ్యగారిసంగయ్యగారు-ముసలాపురం

౩౦ చక్కిలం పాపయ్యగారు-ముసలాపురం

౩౧ తాళవెలిమె లింగన్న ముకద్దంగారు-గడిపెద్దాపురం

౩౨ కిషన్ రావు దేశపాండ్యాగారు తాళ్లపల్లి

౩౩ సుబ్బారెడ్డి దేశముఖుగారు, క్షీరసాగరం.

౩౪ చివుకుల శ్రీరామశర్మగారు- నాగులుప్పలపాడు

౩౫ గజవాడ వెంకటాచార్యులుగారు, అల్లాదుర్గము

౩౬ కాకిరాల రామచంద్రయ్యగారు, మముదాపురము

౩౭ లక్ష్మీనారాయణ గౌడు సెట్టిగారు, అందోలు

౩౮ ఇటికాల రాజేశ్వరరావుగారు - వకీలు కంభంమెట్టు

౩౯ వెలమకన్ని శోభనాద్రిరావుగారు - శోభనాద్రిగూడెం.

౪౦ సారపరాజు వెంకటలక్ష్మీనరసింహారావు దేశముఖుగారు - తమ్మవరం.

౪౧ తిరుమలనల్లాన్ చక్రవర్తి వరదాచార్యుల అయ్యవార్లంగారు - కొత్తాపురం.

౪౨ కొండంభట్లగారి వెంకన్న గారు, గుమ్మడిదల

అభినవ సరస్వతి

సంపాదకుఁడు - నాగరఖండస్వర్ణకారవ్యవహారాది బహుగ్రంథకర్తయగు

జానపాటి పట్టాభిరామశాస్త్రి.

ఇది, యొకమాసపత్రిక. ఇందు వర్ణాశ్రమధర్మబోధక గ్రంథములును విమర్శనము లును వ్యాసములును బ్రకటింపఁబడును. చందా సం॥ 1 కి రు 3-0-0

ఈ కార్యస్థానమున వెలకుదొరకు పుస్తకములు.

1	కరిణీకోద్ధారిణి [పూరె వీరభద్రకవి]	...	0	4	0
2	వాసంతికాపరిణయ నాటకము	...	0	4	0
3	కంసవధ నాటకము	...	0	8	0
4	చమత్కారమంజరి (సింహాద్రి వెంకటాచార్యులు)		0	4	0
5	విరూపాక్షపీఠగురుపరంపర	...	0	2	0
6	నీతిగీతులు (సుమతిశతకమునకు సంస్కృతము)	...	0	2	0
7	విశ్వబ్రాహ్మణశబ్దఖండనము, బ్రాహ్మణశబ్దవిచారము		0	2	0
8	విగ్రహారాధన ఖండనఖండనము	...	0	4	0
9	చిత్తూరుజిల్లాతీర్పు విమర్శనము (పత్రికాధిపతి)	...	0	4	0
10	సంగదోషము	...	0	3	0
11	అస్పృశ్యతానివారణ ఖండనము(మల్లాది రామకృష్ణచయనులుగారు)		0	8	0
12	వత్సలనీతిశతకము	...	0	1	0
13	శివానందలహరి (తంగెడ రామకృష్ణకవి)	...	0	4	0
14	నర్సారావుపేట శతావధానము (తిరుపతివెంకటీయము)		0	3	0
15	పశ్యాంపుశ్యాం	...	0	2	0
16	పశ్యశబ్దవిచారము	...	0	2	0
17	పురశ్చరణము	...	0	2	0
18	శంతనురాజచరిత్ర	...	0	14	0
19	వర్ణవ్యవస్థ	...	0	4	0
20	స్వర్ణకారవ్యవహారము	...	1	8	0
21	శుద్ధాంధ్రహరిశ్చంద్ర చరిత్రము	...	0	10	0
22	అభినవశాకుంతల నాటకము	...	0	8	0
23	సూతసంహిత-ఆంధ్రము	...	2	0	0
24	స్కాందమహాపురాణాంతర్గతనాగరఖండము (౧ సంపుటము)		1	0	0
25	డిటో నాగరఖండము (౨ సంపుటము)		1	8	0
26	భారతీయప్రబోధము (పిసుపాటి చిదంబరశాస్త్రి)		0	4	0
27	ధర్మనిర్ణయము.		0	4	0
28	భారతకథాతత్త్వనిర్ణయము(మల్లాదిరామకృష్ణవిద్వచ్చయనులుగారు)		0	4	0

అభినవసరస్వతీకార్యస్థానము, జానపాడు, పిడుగురాళ్ళపోస్టు,

గుంటూరు జిల్లా.